షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 225 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 27 జూన్ 2024 పేజీలు 8 : వెల 3/- ఒంగోలు


VOLUME : 01 ISSUE : 225 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE June 27, 2024 PAGES : 8 PRICE : 3/-

## కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిన సిబిఐ

న్యూఢిల్లీ,జూన్26(షణ్ముఖవెలుగు): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ వ్యవహారంలో మనీల్యాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ ముఖ్యమంత్రి , ఆమ్‌ఆద్మీపార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజీవ్రాల్ ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే. తాజాగా,ఇదే కేసులో కేజీవ్రాల్‌ను సిబిఐ అరెస్ట్ చేసింది.ఆయన అరెస్ట్‌కు కోర్టు బుధవారం అనుమతించడం తో రౌస్ అవెన్యూ కోర్టు లోనే సీబీఐ అదుపు లోకి తీసుకుంది. అనంతరం న్యాయమూర్తి అమితాబ్ రావత్ ఎదుట హాజరుపరిచిన అధికారులు ఐదు రోజుల కస్టడీకి కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఇదే కేసులో ట్రయల్ కోర్టు

మిగతా 2లో..





## లోక్‌సభ స్పీకర్‌గా ఓంబిర్లా ఎన్నిక

**మూజువాణి ఓటుతో రెండోసారి బాధ్యతలు**

**అభినందించిన ప్రధాని మోడీ, విపక్షనేత రాహుల్**

**ఎమర్జెన్సీ ఓ చీకటి అధ్యాయం**

**సభలో ప్రస్తావించిన స్పీకర్ ఓం బిర్లా**

**విపక్షాల తీవ్ర అభ్యంతరం మధ్య సభలో మౌనం పాటింపు**

న్యూఢిల్లీ,జూన్26(షణ్ముఖవెలుగు): లోక్‌సభ స్పీకర్‌గా మరోసారి ఓంబిర్లా గెలుపొందారు. బుధవారం జరిగిన ఓటింగ్‌లో ఇండియా కూటమి అభ్యర్థి కె.సురేశ్‌పై ఓం బిర్లా గెలుపొందారు. మూజువాణీ ఓటుతో ఓంబిర్లా విజయం సాధించినట్లు ప్రొటెం స్పీకర్

మిగతా 2లో..

## విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయండి

**కేంద్రమంత్రి కుమారస్వామికి బిజెపి ఎంపిల వినతి**

న్యూఢిల్లీ,జూన్26(షణ్ముఖవెలుగు): వైజాగ్ స్టీల్‌ప్లాంట్ అంశంపై కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖమంత్రి కుమారస్వామిని ఢిల్లీలో బుధవారం

మిగతా 2లో..



## ప్రధాని మోడీతో టిడిపి ఎంపిల భేటీ

న్యూఢిల్లీ,జూన్26(షణ్ముఖవెలుగు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీని బుధవారం ఢిల్లీలో తెదేపా ఎంపీలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మోదీ వారిని అప్యాయంగా పలకరించి మాట్లాడారు. రాబోయే అయిదేళ్లు రాష్ట్రంలో, కేంద్రంలో తెదేపా, భాజపా కలిసి పని చేస్తాయని చెప్పారు. నా మిత్రుడు చంద్రబాబు



నేతృత్వంలో కలిసి పని చేస్తామని ప్రధాని అన్నారు. దేశ, రాష్ట్ర అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు మోదీ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలు, బైరెడ్డి శబరి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు ప్రధానిని కలిసిన వారిలో ఉన్నారు.

# సింపుల్ గవర్నమెంట్.. ఎఫెక్టివ్ గవర్నెన్స్

**కుప్పంలో సహా జిల్లాలో అభివృద్ధి పనుల అమలు**

**పేదరిక నిర్మూలన కుప్పం నుంచే ప్రారంభం**

**రెండోరోజు కొనసాగిన సిఎం చంద్రబాబు పర్యటన**

**ప్రజల నుంచి వినతులు స్వీకరణ..అధికారులకు దిశానిర్దేశం**



చిత్తూరు,జూన్26(షణ్ముఖవెలుగు): సింపుల్ గవర్నమెంట్.. ఎఫెక్టివ్ గవర్నెన్స్ నా విధానం అని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు.. రానున్న రోజుల్లో కుప్పంలో సహా జిల్లాలో అభివృద్ధి పనుల అమలుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని తన సొంత నియోజకవర్గం కుప్పం పర్యటనలో కీలక వ్యాఖ్యలు చేశారు సింపుల్ గవర్నమెంట్.. ఎఫెక్టివ్ గవర్నెన్స్ నా విధానమన్న ఆయన.. సాయంత్రం 6 గంటల తరువాత మంత్రులు సమావేశాలు పెట్టకండని చెప్పాను అన్నారు.. బలవంతపు జనసమీకరణతో పెద్ద పెద్దమీటింగ్‌లు, భారీ కాన్వాయ్ లతో సైరన్ల మోతతో హంగామాలు తమ ప్రభుత్వంలో ఉండబోవు అన్నారు.. ఇక, అధికారులు ఫిజికల్.. వర్చ్యువల్ పని విధానాలకు సిద్ధపడాలని సూచించారు. కుప్పం అభివృద్ధికి సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు.. మరోవైపు.. కుప్పంలో రౌడీయిజం, హిసం, గంజాయి, అక్రమాలు కనిపించకూడదు అని స్పష్టం చేశారు.. రాజకీయ ప్రోద్బలంతో పెట్టిన తప్పుడు రౌడీ షీట్లు ఎత్తేవేయండి అన్నారు.. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు కుప్పం నుండే శ్రీకారం చుట్టనున్నట్టు వెల్లడించారు. మరోవైపు.. కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటన ముగిసింది.. పీఈఎస్ మెడికల్ కళాశాలలో


మిగతా 2లో..

# పిన్నెల్లి అరెస్ట్

**పిన్నెల్లి బెయిల్ పిటిషన్ తిరస్కరణ**

**వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు**

**వివిధ కేసుల్లో అరెస్ట్ చేసి తరలింపు**



అమరావతి,జూన్26(షణ్ముఖవెలుగు): మాచర్ల వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామ కృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. నరసరావుపేటలోని మాజీ మంత్రి అనీల్ కుమార్ యాదవ్ ఇంట్లో ఉన్న పిన్నెల్లిని అదుపులోకి తీసుకుని.. పల్నాడు ఎస్పీ ఆఫీసుకు తరలించారు. ఈవీఎం ధ్వంసంతోపాటు పలు హత్యాయత్నం కేసుల్లో నిందితుడిగా ఉన్న పిన్నెల్లి.. ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టులో నాలుగు పిటీషన్లు దాఖలు చేశారు. ఈ పిటీషన్లపై విచారణ చేసిన హైకోర్టు.. బుధవారం ముందస్తు బెయిల్ పిటీషన్లను కొట్టివేసింది. దీంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేసి ఎస్పీ ఆఫీసుకు తరలించారు. మొన్నటి ఎన్నికల అనంతరం ఏపీలో చెలరేగిన అల్లర్ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ముఖ్యంగా పల్నాడు జిల్లాలో అల్లర్లు రావణకాష్టాన్ని తలపించాయి. మాచర్లలో టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య పోలింగ్ రోజు మొదలైన ఘర్షణలు పోలింగ్ అనంతరం కూడా కొనసాగాయి. ఈ అల్లర్లను సీరియస్ గా తీసుకున్న ఎన్నికల సంఘం ప్రత్యేకబృందాలతో దర్యాప్తు చేయించింది. ఈ ఘర్షణల్లో వైసీపీ నేత, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై

## ఇంటర్ ఫస్టియర్ సప్లింమెంటరీ ఫలితాలు వెల్లడి

**సచివాయలంలో విడుదల చేసిన మంత్రి లోకేశ్**

అమరావతి,జూన్26(షణ్ముఖవెలుగు): ఏపీలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సచివాలయంలో సాయంత్రం 4 గంటలకు ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సప్లిమెంటరీ పరీక్షలో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు

మిగతా 2లో..

## మా కార్యాలయాలు కూల్చేయబోతున్నారు

**హైకోర్టులో వైకాపా పిటిషన్**

అమరావతి,జూన్26(షణ్ముఖవెలుగు): రాష్ట్రంలో తమ పార్టీ కార్యాలయాలు కూల్చివేయబోతున్నారంటూ ఏపీ హైకోర్టులో వైకాపా నేతలు లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. కార్యాలయాల కూల్చివేతకు రంగం సిద్ధమైందని పిటిషనర్ తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు తీసుకున్న తర్వాత కోర్టుకు సమాచారం ఇస్తానని ప్రభుత్వం తరఫు న్యాయవాది చెప్పారు. తాము ఇప్పటికిప్పుడు కూల్చివేయబోవడం లేదని ప్రభుత్వ న్యాయవాది స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా నిర్మించడంతో నోటీసులు మాత్రమే ఇచ్చామన్నారు. దీంతో కేసు విచారణను హైకోర్టు గురువారానికి వాయిదా వేసింది. అప్పటి వరకు స్టేటస్ కో పాటించాలని ఆదేశించింది.

## ఒకటి రెండు రోజుల్లోనే పింఛన్ల పంపిణీ పూర్తిచేయాలి

**సచివాలయ ఉద్యోగులంతా పింఛన్ల పంపిణీలో పాల్గొనాలి**

**ఊరికి దూరంగా కట్టిన సచివాలయాల మీద నివేదిక ఇవ్వండి**

**రాజీనామా చేసినా సెల్‌ఫోన్లు, సిమ్ కార్డుల స్వాధీనం చేయని వారిపై చర్యలు**

**సచివాలయాలు, పంచాయితీల మధ్య సమన్వయ లోపాన్ని సవరించాలి**

**అధికారులతో మంత్రి డా. డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి సమీా**

అమరావతి,జూన్26(షణ్ముఖవెలుగు): జూలై ఒకటోతేదీన జరిగే పింఛన్ల పంపిణీలో ఎలాంటి జాప్యం జరగడానికి వీల్లేదని గ్రామ, వార్డు సచివాలయ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు.

మిగతా 2లో..

# కష్టాల్లో ఉన్నవారికి అండగా ఉంటా

**ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్**



అమరావతి,జూన్26(షణ్ముఖవెలుగు): కష్టాల్లో ఉన్నవారికి అండగా ఉంటానని ప్రజలకు మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. ఉండవల్లిలోని నివాసంలో బుధవారం నిర్వహించిన 'ప్రజాదర్బార్'కు మంగళగిరితో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయం నుంచే నారా లోకేశ్‌ను నేరుగా కలిసి తమ సమస్యలు విన్నవించేందుకు బారులు తీరారు. ఎవరూ అధైర్యపడవద్దని, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరి వద్ద నుంచి వినతిపత్రాలు స్వీకరించి సంబంధిత శాఖలకు పంపాలని సిబ్బందిని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ సభ్యుల గౌరవ వేతనాలు పెంచాలని మంగళగిరి నియోజకవర్గం పెదవడ్లపూడి

మిగతా 2లో..

## దేశం మెచ్చేలా పంచాయితీ వ్యవస్థను తీర్చిదిద్దుదాం

**నాశనం అయిన వ్యవస్థలను గాడిలో పెడదాం**

**పంచాయితీ ఉద్యోగులతో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్**

అమరావతి,జూన్26(షణ్ముఖవెలుగు): దేశం మెచ్చేలా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ వ్యవస్థకు సొబగులు, విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేలా పని చేస్తానని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అన్నారు. గత ప్రభుత్వంలో నాశనం అయిన వ్యవస్థలను గాడిలో పెట్టేలా కలిసికట్టుగా పని చేద్దామని సూచించారు. అయితే ఉద్యోగులు సహకరిస్తేనే ఇది సాధ్యమని అన్నారు. ఉద్యోగులను చిన్నచూపు చూడనని.. వారిని తన కుటుంబ సభ్యులుగా పరిగణిస్తానని స్పష్టం చేశారు.

మిగతా 2లో..



## జగన్‌కు రూల్స్ కూడా తెలియవు

**ప్రతిపక్షనేత హోదా ఇస్తే రాదు**

**ప్రజలు తగిన మెజార్టీ ఇస్తేనే వస్తుంది**

**సలహాలు ఇచ్చేవారిని మార్చుకుంటే మంచిది**

**సభవ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శలు**



అమరావతి,జూన్26(షణ్ముఖవెలుగు): జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేత హోదా తాము కాదని ప్రజలే ఇవ్వలేదని శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. జగన్మోహన్ రెడ్డి తనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలంటూ రాసిన లేఖపై స్పందించారు. జగన్‌మోహన్ రెడ్డి తప్పుడు సమాచారంతో లేఖలు రాశారని ఆయన రూల్ బుక్ చదవాలని సూచించారు. ఆయన

మిగతా 2లో..

## ఒకటి రెండు రోజుల్లోనే పింఛన్ల పంపిణీ పూర్తిచేయాలి

**మొదటిపేజీ తరువాయి..**

బుధవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన వెంటనే ఆ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులంతా పింఛన్ల పంపిణీలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇప్పటిదాక లక్షా 9వేల మంది వాలంటీర్లు రాజీనామా చేశారు సరే.. రాజీనామా చేసి కూడా సెల్ ఫోన్లు, సిమ్ కార్డులు స్వాధీనం చేయని వారి సంగతేంటని ప్రశ్నించారు. అలాంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చాలాచోట్ల గ్రామ, వార్డు సచివాలయ భవనాలు ఊరికి దూరంగా, ప్రజలకు ఏవిధంగానూ అందుబాటులో లేకుండా ఉండటంతో అవన్నీ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయని, అలాంటి వాటిపై వెంటనే సమగ్ర నివేదిక ఇవ్వాలని మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి అధికారులను కోరారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగులందరి సెలవుల మంజూరుపై ఒక కచ్చితమైన విధానాన్ని రూపొందించాలని చెప్పారు. సచివాలయాలు జారీ చేసే సర్టిఫికెట్లు, ఇతర సర్వీసు పత్రాలపై పాత లోగోలు లేకుండా జాగ్రత్త పడాలని ఈ విషయంలో ఎక్కడైనా అలసత్వం వహించినట్టు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సచివాలయ భవనాల మీద గత ప్రభుత్వ లోగోలు, ఫోటోలు తొలగించి వాటి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వ చిహ్నాన్ని ఉంచాలని సూచించారు.రాష్ట్రంలో చాలా చోట్ల గ్రామ సచివాలయాలకు, పంచాయితీలకు మధ్య సమన్వయం లేదని మంత్రి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల ప్రకారం ఇతర శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులను సైతం సంప్రదించి అవసరమైతే ఒక కమిటీ వేసుకుని సమన్వయాన్ని సాధించాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయాల రోజు వారి వ్యవహారాలను పరిశీలించేలా మండల స్థాయిలోనే ఒక అధికారికి బాధ్యతలు అప్పజెప్పే దిశగా కూడా ఆలోచనలు చేయాలని మంత్రి ఆదేశించారు. రక్త హీనత, పోషక ఆహార లోపం, బడి బయటి పిల్లలు, పాఠశాలల్లో మౌలిక వసతులు వంటి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై దృష్టి పెట్టి పురోగతి సాధించాలని కూడా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ, వార్డు సచివాలయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ , ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దివాన్ మైదీన్ , డైరెక్టర్ శివప్రసాద్ రాష్ట్రంలోని సచివాలయాల ప్రస్తుత పరిస్థితి మీద రూపొందించిన సమగ్ర సమాచార నివేదికను మంత్రికి సమర్పించారు. ఇంకా ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ డా. అభిషేక్ గౌడ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జగన్‌కు రూల్స్ కూడా తెలియవు

**మొదటిపేజీ తరువాయి..**

చదవకపోతే మనుషుల్ని పెట్టి చదివించు కోవాలన్నారు. లేఖ రాసిన సలహాదారుడ్ని కూడా మార్చుకోవాలని అందులో అన్నీ తప్పులే ఉన్నాయన్నారు. గతంలో పదిశాతం ఎమ్మెల్యేలు లేకపోయినా పి జనార్ధన్ రెడ్డిని ప్రతిపక్షనేతగా గుర్తించారంటూ లేఖలో రాశారని.. తెలియకపోతే తెలుసుకోవాలన్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీ పక్ష నేత మాత్రమేనన్నారు. ప్రధాన ప్రతిపక్షహోదా ఇవ్వలేదన్నారు. లోక్‌సభలో పి ఉపేంద్రను ప్రతిపక్షనేతగా గుర్తించారని జగన్ చెప్పడం కూడా తప్పేనన్నారు. సభలో కోరానికి తగ్గ బలం ఉంటేనే ప్రతిపక్ష నేత హోదా ఇస్తారని పయ్యావుల స్పష్టం చేశారు. వైసీపీ పక్ష నేతగా ప్రతిపక్షంగా జగన్ ఉంటారని.. కానీ ప్రధాన ప్రతిపక్ష నేతగా గుర్తింపు మాత్రం ఉండదన్నారు. ప్రధాన ప్రతిపక్ష నేతకు కేబినెట్ హోదా ఉంటుందని ఆ హోదా కోసమే జగన్ లేఖలు రాస్తున్నారని పయ్యావుల విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు సలహాదారులను పెట్టుకోని నీకు ఈ గతి పట్టింది జగన్.. మళ్లీ అదే సలహాదారులతో స్పీకర్‌కు లేఖ రాసినట్లు ఉన్నావు.. ఇలాగే ఉంటే నీ రాజకీయం ఇంకా దారుణంగా ఉంటుందని సలహా ఇచ్చారు. సఎం తర్వాత ప్రతిపక్షనేత ప్రమాణ స్వీకారం చేయాలని అన్న జగన్‌కు అసలు సభ నియమాలు తెలుసా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష హోదాలో ఉండేందుకు కనీస మెజార్టీ ఎమ్మెల్యేలు కూడా లేని వైసీపీ.. ప్రతిపక్ష హోదా ఇవ్వాలని ఎలా అడుగుతుందని ప్రశ్నించారు. అసలు జగన్ కు ఇలాంటి సలహా ఇచ్చిందెవరో ఒకసారి అన్నీ తెలుసుకుని సలహాలివ్వాలని సూచించారు. జగన్ రాసిన లేఖలోని ప్రతి అంశానికి పయ్యావుల సమాధానం ఇచ్చారు. అన్నీ తప్పుడు సమాచారమేనని తేల్చారు. సభ విలువలు, సంప్రదాయాల మీద నడుస్తుందని జగన్ వాటిని ఏ మాత్రం లెక్క చేయడం లేదన్నారు. ఏపీ అసెంబ్లీలో తానే ప్రతిపక్ష నేత అని జగన్ చెబుతున్నారు. అధికార పార్టీ కాకుండా ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే ఆ పార్టీ నేతే ప్రధాన ప్రతిపక్ష నేత అవుతారని పది శాతం సీట్లు ఉండాలనే నిబంధన ఎక్కడా లేదని .. స్పీకర్ కు లేఖ రాశారు. కేంద్రం ఈ సారి మాత్రమే ప్రధాన ప్రతిపక్ష నేతగా రాహుల్ ఉన్నారు. అంతకు ముందు రెండు సార్లు కూడా ప్రధాన ప్రతిపక్ష నేత లేరు. కాంగ్రెస్ పక్ష నేతకు సంఖ్యాబలం లేకపోవడంతో ఆ హోదా ఇవ్వలేదు. కానీ జగన్ మాత్రం తనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాల్సిందేనని లేఖలు రాస్తున్నారు.

## విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయండి

**మొదటిపేజీ తరువాయి..**

ఏపీ భాజపా ఎంపీలు కలిశారు. రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి నేతృత్వంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌లు.. కుమారస్వామితో సమావేశమై చర్చించారు. విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ ఈ సందర్భంగా వినతిపత్రం సమర్పించారు. స్టీల్ ప్లాంట్‌ను లాభాలబాట పట్టించే అంశాలపై చర్చించారు. అందుకు సంబంధించిన ప్రణాళికను కేంద్ర మంత్రికి వివరించారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు పూర్వ వైభవం తేవాలని కోరారు. భాజపా ఎంపీలు చెప్పిన అంశాలపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి.. మరోసారి సమావేశమవుదామని తెలిపారు.



## కష్టాల్లో ఉన్నవారికి అండగా ఉంటా



**మొదటిపేజీ తరువాయి..**

ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న కార్మికులు నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం తమకు నెలకు రూ.3 వేల గౌరవ వేతనం ఇస్తున్నారని, దీనిని రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంచాలని కోరారు. పాఠశాలల్లో అదనంగా రాగిజావ, కోడిగుడ్లు ఉడకబెట్టేందుకు ఎలాంటి అదనపు వేతనం ఇవ్వడం లేదని తెలిపారు. అందుకయ్యే గ్యాస్ కూడా తమ జీతం డబ్బుల నుంచే ఖర్చుపెట్టుకుని విద్యార్థులకు అందిస్తున్నామని వాపోయారు. జీతాలు సక్రమంగా అందడం లేదని, పని ఒత్తిడి కూడా అధికంగా ఉందని లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తామని తెలిపారు.

మధ్యాహ్న భోజనంలో ప్రస్తుతం విద్యార్థులకు అందించే మెనూను అడిగి తెలుసుకున్నారు. మెనూ ఏవిధంగా ఉంటే విద్యార్థులు ఇష్టపడతారో వివరాలు ఇవ్వాలని తనను కలిసిన కార్మికులను కోరారు. దివ్యాంగులమైన తమకు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని మంగళగిరి మండలం చినకాకానికి చెందిన మంచాల సీతారామయ్య, ఓబులమ్మ దంపతులు లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. స్వర్ణకార చేతివృత్తిపై జీవనం సాగించే తాను అనారోగ్యానికి గురై ఇంటికే పరిమితం అయ్యానని, పింఛన్ మంజూరు చేయించి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన బుట్టా పానకాలు కోరారు. విదేశాల్లో ఎంబీబీఎస్ చదువుతున్న తన కుమార్తెకు విదేశీ విద్య పథకం ద్వారా ఆర్థికసాయం అందించాలని ఉండవల్లికి చెందిన ఆలపాటి సురేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుడైన తనకు నాలుగు చక్రాల ద్విచక్రవాహనం ఇప్పించి ఆదుకోవాలని తాడేపల్లి మండలం సీతానగరానికి చెందిన ఎస్.రమేష్ విన్నవించారు. మంగళగిరి పట్టణంలో ఆశా కార్యకర్తలుగా పనిచేస్తున్న తమకు పనికి తగిన జీతం ఇవ్వాలని, పని ఒత్తిడి తగ్గించాలని, సెలవులు మంజూరు చేయించాలని కోరారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తానని లోకేశ్ వారికి హామీ ఇచ్చారు.

## సింపుల్ గవర్నమెంట్.. ఎఫెక్టివ్ గవర్నెన్స్



**మొదటిపేజీ తరువాయి..**

పార్టీ శ్రేణుల సమావేశం అనంతరం.. రెండు రోజుల కుప్పం పర్యటన ముగించుకొని ప్రత్యేక హెలికాప్టర్‌లో బెంగళూరు బయల్దేరి వెళ్లారు సీఎం చంద్రబాబ నాయుడు. సీఎం చంద్రబాబు కుప్పం పర్యటన రెండో రోజు కొనసాగుతోంది. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్న ప్రజలు.. తమ సమస్యలను సీఎంకు వివరించారు. వినతులను సీఎం అందరి నుంచి స్వయంగా తీసుకుని పరిశీలించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, అధికారులను ఆయన ఆదేశించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో మీరు పడ్డ కష్టాలన్నీ నాకు గుర్తున్నాయిమీ ఆత్మస్థైర్యం ముందు నాటి ప్రభుత్వ కుట్రలు పని చేయలేదుపార్టీ కోసం కష్టపడి పని చేసిన వారిని గుర్తించి పదవులిచ్చే బాధ్యత నాది-కుప్పం నియోజకవర్గ కార్యకర్తలు, నేతల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కష్టపడి పని చేసిన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూసుకునే బాధ్యత తనదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. టీడీపీని బలహీన పరచాలనుకున్న నాటి ప్రభుత్వ కుట్రలు నేతలు, కార్యకర్తల ఆత్మస్థైర్యం ముందు పని చేయలేదన్నారు. కుప్పం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో చంద్రబాబు బుధవారం సమావేశమయ్యారు. గత ఐదేళ్ల పనితీరును, ఎన్నికల్లో అవలంభించిన విధానాలపై చంద్రబాబు సమీక్షించారు. 2029 ఎన్నికలకు ఏ ప్రణాళికతో పనిచేయాలో



నేతలు, కార్యకర్తలకు సూచించారు. అనంతరం వారిని ఉద్దేశించి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.... 8సార్లు నేను కుప్పం నుండి ఎమ్మెల్యేగా గెలిచాను...గత ఐదేళ్లలో పాలనలో జరిగినంత హింస, దాడులు, దారుణాలు ఏనాడూ చూడలేదు. నన్ను నైతికంగా దెబ్బతీయాలని చూశారు...స్థానిక నేతలు, కార్యకర్తలపై దాడులు చేసి, ప్రలోభాలకు గురిచేసి నాయకత్వాన్ని దెబ్బతీయాలని చూశారు. అయినా వారి ఎత్తులు సాగలేదు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ నేతలు అక్రమాలకు పాల్పడ్డారు. టీడీపీ అభ్యర్థులను కనీసం నామినేషన్ కూడా వేయనీయలేదు. నేను జిల్లా పర్యటనకు వస్తే జీవో-1 తెచ్చి రాకుండా అడ్డుకున్నారు... నిరసన తెలిపిన కార్యకర్తలపైనా అక్రమ కేసులు బనాయించారు. అక్రమంగా 10 మందిని అరెస్టు చేసి 30 రోజుల పాటు జైల్లో పెట్టారు. ఇలా ఒకటని కాదు...అన్ని విధాలుగా ప్రయత్నించి కుప్పంలో టీడీపీని దెబ్బకొట్టాలని చూశారు. వాటన్నింటిని తట్టుకుని మీరు పని చేశారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి నాటి ప్రభుత్వం రూపాయి కూడా ఖర్చులేదు. సామాన్య కార్యకర్తలను మంత్రులు, ఎంపీలను చేసిన చరిత్ర టీడీపీది 'నాపై రెండు గురుతర బాధ్యతలున్నాయి.
ఒకటి కుప్పంను దేశంలోనే నెంబర్ -1 నియోజకవర్గంగా అభివృద్ధి వైపు తీసుకెళ్లడం...రెండు కుప్పంలో పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారిని గుర్తించి పదవులు ఇవ్వడం. మీరంతా ప్రజలతో మమేకమై బాగుండాలి...గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు మీరు కూడా చేయొద్దు. గత ప్రభుత్వానికి...మన ప్రభుత్వానికి మధ్య మార్పు ప్రజలకు కనిపించాలి. మనమంతా క్రమశిక్షణ, బాధ్యతతో ఉండాలి. బాగా పని చేస్తే ఏ స్థాయి నాయకుడు అయినా...వారి ఇంటకి వెళ్లి నేనే అభినందనలు తెలుపుతా. నా చుట్టూ తిరగకుండా పార్టీపై దృష్టి పెట్టాలి. సామాన్య కార్యకర్తలను ఎంపీలు, మంత్రులుగా చేసిన చరిత్ర మన టీడీపీకి ఉంది. కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే పూచి నాది.' అని సీఎం చంద్రబాబు నాయుడు టీడీపీ నేతలు, కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

## దేశం మెచ్చేలా పంచాయితీ వ్యవస్థను తీర్చిదిద్దుదాం

**మొదటిపేజీ తరువాయి..**

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బుధవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులతో సమావేశం అయ్యారు. ఉద్యోగుల సమస్యలు ఆసాంతం వింటూ... వాటిని నోట్ చేసుకున్నారు. అనంతరం పవన్ మాట్లాడుతూ.. మస్యలను వినేందుకు, వాటిని సాధ్యమైనంత వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. సమస్యలను చెప్పడమే కాదు... ఆమోదయోగ్యమైన పరిష్కార మార్గం సూచించాలని ఉద్యోగులతో అన్నారు. భారత దేశం మెచ్చేలా, జాతి మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు తిరిగి చూసేంత అద్భుతంగా రాష్ట్ర పంచాయతీరాజ్ వ్యవస్థను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పని చేద్దామని పిలుపిచ్చారు. దీనికి తాను కంకణబద్ధుడినై పని చేస్తానన్నారు. తన ఒక్కడి వల్లనే ఈ మహా క్రతువు పూర్తి కాదని, ఉద్యోగుల సహకారం, సూచనలు చాలా అవసరమని.. దీనికి ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషిస్తారని బలంగా విశ్వసిస్తున్నానని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు.

## ఇంటర్ ఫస్టియర్ సప్లిమెంటరీ ఫలితాలు వెల్లడి

**మొదటిపేజీ తరువాయి..**

లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితాలను అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ జనరల్, వొకేషనల్ విద్యార్థులు తమ హాల్‌టికెట్ నెంబరు, పుట్టినతేదీ వివరాలు నమోదుచేసి ఫలితాలు ఇక్కడ చూసుకోవచ్చు. ఇప్పటికే ఇంటర్ సెకండియర్ పరీక్షల ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే. తాజాగా ప్రథమ సంవత్సరం ఫలితాలను విడుదల చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి మొత్తం 43 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. పరీక్షలకు మొత్తం 1,46,750 మంది విద్యార్థులు హాజరుకాగా.. 63,548 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో జనరల్ విద్యార్థులు 1,33,591కిగాను 56,836 మంది, ఒకేషనల్ విద్యార్థులు 13,159కిగాను 6712 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇక ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు రాసినవారిలో మొత్తం 78 శాతం విద్యార్థులు తమ మార్కులను మెరుగుపరుచుకున్నారు. పరీక్షలకు మొత్తం 2,10,820 మంది విద్యార్థులు హాజరుకాగా.. 1,64,716 మంది విద్యార్థుల మార్కులు పెరిగాయి. ఇందులో జనరల్ విద్యార్థులు 1,63,101 మంది ఉండగా.. 1615 ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. సప్లిమెంటరీ ఫలితాల్లోనూ బాలికలే ఆధిపత్యం చెలాయించారు. పరీక్షలకు 66,881 మంది బాలికలు హాజరైతే 31,048 మంది (46 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఇక బాలురు 79,869 మంది పరీక్షకు హాజరైతే.. 32,500 మంది (41 శాతం) మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు, సప్లిమెంటరీ పరీక్షలు కలిపిచూస్తే.. జనరల్ విభాగంలో 80 శాతం, ఒకేషనల్ విభాగంలో 78 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జనరల్ విభాగంలో 4,61,273 మంది విద్యార్థులు హాజరుకాగా.. 3,67,711 మంది (80 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇక ఒకేషనల్ విభాగంలో 38,483 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 29,893 మంది (78 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ఫస్టియర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలపై ఏమైనా సందేహాలుంటే రీవెరిఫికేషన్ కోసం అవకాశం కల్పించారు. విద్యార్థులు జూన్ 28 నుంచి జులై 4 వరకు రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకుగాను ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది.

## పిన్నెల్లి అరెస్ట్

**మొదటిపేజీ తరువాయి..**

పలు కేసులు నమోదవ్వగా కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఇంతకాలం ముందస్తు



బెయిల్‌పై ఆయన మరింత కాలం పొడగించాలంటూ దాఖలు చేసిన పిటిషన్లను ఏపీ హైకోర్టు తోసిపుచ్చడంతో పోలీసులు రంగంలోకి దిగారు. అరెస్ట్ చేసిన ఎస్పీ కార్యాలయానికి తరలించారు. అసెంబ్లీ పోలింగ్ మరుసటి రోజు చోటు చేసుకున్న హింసాత్మక సంఘటనలకు సంబంధించి మాచెర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై మొత్తం 14కేసులు నమోదయ్యాయి. ఇందులో మూడు హత్యాయత్నం కేసులున్నాయి. రెంటచింతల మండలం పాల్వాయి గేట్ గ్రామంలో ఈవీఎం ధ్వంసం ఘటన ప్రధానంగా ఉంది. కాగా ఈ కేసుల్లో నిందితుడిగా ఉన్న పిన్నెల్లి సోదరుడు వెంకట రామిరెడ్డి అప్పటి నుంచి పరారీలో ఉన్నారు. అయితే పోలీసులు అతడిని ఎందుకు అరెస్ట్ చేయలేకపోయారని టీడీపీ ప్రశ్నిస్తోంది. పోలీసు శాఖలో కొంతమంది దిగువ స్థాయి అధికారులు ఇస్తున్న లీకులతోనే వెంకట రామిరెడ్డి తప్పించుకు తిరుగుతున్నారని కూటమి పక్షాలు చెబుతున్నాయి. ఈవీఎంలను ధ్వంసం సందర్భంగా టీడీపీ ఏజెంట్‌పై దాడి ఘటనలో పిన్నెల్లిపై హత్యాయత్నం కేసు నమోదయింది. కారంపూడిలో దాడి కేసులో సీఐ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పిన్నెల్లి బ్రదర్స్‌పై మరో హత్యాయత్నం కేసు నమోదయింది. ఇవి కాకుండా ఈవీఎంను ధ్వంసం చేసిన ఘటనలో మరో కేసు నమోదయింది. మొత్తం నాలుగు కేసులు ఆయనపై ఉన్నాయి. హత్యాయత్నం కేసుల్లో ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆయన పిటిషన్లు వేశారు. గతంలో ఎన్నికల కౌంటింగ్ ఉండటంతో ఏపీ హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. అయితే ఈ మధ్యంతర బెయిల్‌పై బాధితులు సుప్రీంకోర్టుకు వెళ్లారు. అప్పట్లో హైకోర్ట్ మధ్యంతర బెయిల్‌పై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దీంతో పిన్నెల్లి పిటిషన్లపై గతంలోనే వాదనలు విన్న ఏపీ హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది.

## కలుషిత ఆహారం తిని 8 మంది విద్యార్థులకు అస్వస్థత

**ముద్దనూరు మండలం వసతి గృహంలో ఘటన**

కడప,జూన్26(షణ్ముఖవెలుగు): సాంఘీక సంక్షేమ వసతి గృహంలో కలుషిత ఆహారం తిని 8 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కడప జిల్లా ముద్దనూరు మండలంలో బుధవారం స్థానిక సాంఘీక సంక్షేమ వసతి గృహంలో ఉదయం అల్పాహారంలో భాగంగా విద్యార్థులకు ఇడ్లి, సాంబారు ఏర్పాటు చేశారు. హాస్టల్లో 28 మంది విద్యార్థులు అల్పాహారం తిన్నారు. వీరిలో 8మంది అస్వస్థత గురయ్యారు. యశ్వంత్, బన్నీ, వెంకటేష్, సతీష్, లక్ష్మి నరసింహులు, సుశాంత్, పెంచల్ నరసింహులు, నాగేంద్ర కడుపు నొప్పి, వాంతులై అస్వస్థతకు గురయ్యారు. యశ్వంత్, బన్నీ తీవ్ర అస్వస్థతకు గురవడంతో ప్రయివేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ఆర్డీఓ నరసింహులు హాస్టల్ వద్దకు చేరుకుని వంట గది, ఆహారాన్ని, పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో అధికారులతో మాట్లాడారు. ఉడకని ఇడ్లి, సాంబారులో కుళ్ళిన కూరగాయలు ఉడకని కంది బ్యాల్లు తిని వాంతులు, కడుపు నొప్పి బారిన పడ్డామని విద్యార్థులు ఆర్డీఓతో ఆవేదన వ్యక్తం చేశారు. అల్పాహారం, భోజనం, కూరలు రుచికరంగా ఉండవని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ అల్పాహారం, నీటి శాంపిళ్లు సేకరించి పరీక్షలు జరిపించాలని అధికారులకు సూచించారు. నీటి క్యాన్లతో నీటి సదుపాయం కల్పించాలని వా÷-డ్గ÷న్ మనోహర్ కు ఆదేశించారు. ప్రతి రోజు హాస్టల్ తనిఖీ చేయాలని విఆర్ఒకు సూచించారు. నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని, నీరు అందించాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి పరిశీలించారు. పిహెచ్ సి వైద్యులు కరిష్మా, శ్రీకాంత్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపిడిఒ చంద్ర మౌలీశ్వర్, సిఐ దస్తగిరి, డిటి సౌజన్య పరిశీలించారు.

## కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిన సిబిఐ

**మొదటిపేజీ తరువాయి..**

గత గురువారం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేయగా, దీనిపై ఈడీ హైకోర్టును ఆశ్రయించింది. దిగువ న్యాయస్థానం తమ వాదనలకు తగినంత సమయం ఇవ్వలేదని ఆరోపించింది. దీంతో ట్రయల్ కోర్టు ఉత్తర్వులపై హైకోర్టు స్టే విధించింది. ఈడీ సమర్పించిన ఆధారాలను ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకోవడంలో విఫలమైందని, బెయిల్ మంజూరులో నిర్ణయం తీసుకునేటప్పుడు సమగ్ర పరిశీలన చేయలేదని ఆక్షేపించింది. ఈ నేపథ్యంలో హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో కేజ్రీవాల్ పిటిషన్ వేశారు. అయితే హైకోర్టు నిర్ణయం వెలువడిన తరువాత దీనిపై విచారణ చేపడతామని స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పు వెలువడడంతో బుధవారం దీనిపై విచారణ చేపట్టింది.అయితే ఈ పిటిషన్‌ను తాజాగా కేజ్రీవాల్ తరఫున న్యాయవాదులు వెనక్కు తీసుకున్నారు. పిటిషన్ ఉపసంహరించుకుంటామని కేజ్రీవాల్ కోరగా, అందుకు జస్టిస్ మనోజ్‌మిశ్రా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిల ద్విసభ్య ధర్మాసనం అనుమతించింది. హైకోర్టు పూర్తిస్థాయి ఉత్తర్వులు, సిబిఐ అరెస్ట్ వంటి పరిణామాల నేపథ్యంలో సమగ్ర పిటిషన్ దాఖలు చేస్తామని కేజ్రీవాల్ తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ న్యాయస్థానానికి తెలిపారు. అయితే కేజ్రీవాల్ అరెస్ట్‌కు సీబీఐకి కోర్టు అనుమతివ్వడంపై ఆయన తరఫు న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇది అత్యంత పక్షపాతంతో కూడిన చర్యగా వ్యాఖ్యానించారు. ఇప్పటికే కేజ్రీవాల్‌ను 9 గంటల పాటు ఏప్రిల్‌లో సిబిఐ ప్రశ్నించిందని, ఆయన తరఫు న్యాయవాది విక్రమ్ చౌదరి అన్నారు. ఈ కేసు ఆగస్టు2022 నుంచి పెండింగ్‌లో ఉంది.. నన్ను సాక్షిగా పిలిచారు.. నేను హాజరయ్యాను. తొమ్మిది గంటల పాటు విచారణ జరిగింది. అప్పటి నుంచి ఒక్క నోటీస్ కూడా సిబిఐ నుంచి రాలేదు. సాక్షి నుంచి నిందితుడిగా ఎలా మారారు. ఇది చాలా దారుణం అని మండిపడ్డారు. తన వాదన వినిపిస్తూ కేజ్రీవాల్ దురుద్దేశంతో కూడిన అనవసర ఆరోపణలు చేస్తున్నారని సిబిఐ పేర్కొంది.




## బాధ్యతలు స్వీకరించిన మంత్రి జనార్ధన్ రెడ్డి

అమరావతి,జూన్26(షణ్ముఖవెలుగు): ఆంధ్రప్రదేశ్‌లో కొత్త సర్కార్ ఏర్పడిన తరవాత మంత్రులు వరుసగా బాధ్యతలు స్వీకరిస్తున్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహా.. పలువురు మంత్రులు తమకు కేటాయించిన శాఖల బాధ్యతలు స్వీకరించారు.. ఇక, ఈ రోజు రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రిగా బీసీ జనార్ధన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.. సచివాలయంలోని తన ఛాంబర్‌లో మొదట వేద పండితుల ఆశీర్వచనాలు తీసుకున్న ఆయన.. ఆ తర్వాత మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా.. ఆయనకు కుటుంబ సభ్యులు, ఆ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.. అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి.. కీలక వ్యాఖ్యలు చేశారు.. 2014-19లో ఆర్ అండ్ బీ శాఖకు బడ్జెట్‌లో14 వేల 970 కోట్ల రూపాయలు కేటాయించగా రూ.12 వేల 64 కోట్లు ఖర్చు చేయడం జరిగింది.. అంటే 80 శాతం నిధులు ఖర్చు చేసినట్టు చెప్పారు. కాగా, గత ప్రభుత్వం 2019-24లో ఆర్ అండ్ బీకి రూ.19 వేల 428 కోట్లు బడ్జెట్ ల్లో కేటాయించింది కేవలం రూ.9 వేల 15 కోట్లు.. అనగా 46 శాతం మాత్రమే ఖర్చు చేశారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన రూ. 2 వేల 261 కోట్లకు బిల్లులు చెల్లించ లేదని దానివల్ల పనులు చేసినా కాంట్రాక్టర్లు చాలా ఇబ్బంది పడుతున్నారని.. ఇప్పుడు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు · తెలుగు దినపత్రిక
ప్రకాశం

# ప్రజా సంక్షేమ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తా

## మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జూన్ 26)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి ప్రజలు ఆశించిన మేరకు చేస్తుందని మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. రాష్ట్ర సచివాలయం మూడవ భవనం మొదటి అంతస్థులో కుటుంబ సభ్యులతో పూజ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం సాంఘిక సంక్షేమ, వికలాంగులు, వయో వృద్ధుల సంక్షేమ, గ్రామ సచివాలయ, వాలంటీర్ల శాఖ మంత్రిగా బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. తనపై నమ్మకంతో ముఖ్యమంత్రి అప్పగించిన ప్రజా సంక్షేమ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తానని మంత్రి తెలిపారు. ప్రకాశం జిల్లా శింగరాయకొండలో ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయల సంస్థ ఆధర్యంలో నడపబడుచున్న డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఆర్ట్స్ గ్రూప్ సి.ఈ.సి (80 సీట్స్) తోపాటు ఎం.పి.సి 40 సీట్స్, బైపీసి 40 సీట్స్ అదనంగా మంజూరు చేస్తూ, పైలట్ ప్రాజెక్ట్ క్రింద బాపట్ల జిల్లా నాగులపాలెం బాలికల గురుకుల విద్యాలయంలో పాఠశాల కు సరఫరా చేయబడిన కూరగాయలు, పండ్లు, గ్రుడ్లు మొదలగు సామగ్రి తాజాగా విద్యార్థులకు అందించేందుకు అనువుగా కోల్డ్ స్టోరేజ్ యూనిట్ ను మంజూరు చేస్తూ, అదేవిధంగా విద్యార్థులకు వేడి నీటిని అందించేందుకు పాఠశాలలో సోలార్ వాటర్ హీటర్ సౌకర్యం కూడా కల్పిస్తూ మూడు ఫైల్స్ పై మంత్రి సంతకాలు చేశారు. ఈ రెండు పైలట్ ప్రాజెక్టుల ఫలితాల ఆధారంగా రాష్ట్రమంతా వీటిని విస్తరింప చేయడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. షెడ్యూలు తెగలకు చెందిన విద్యార్థులకు ఫీజులు మంజూరు చేయడంలో సాంఘిక సంక్షేమ శాఖ నోడల్ శాఖగా పనిచేస్తుంది అని ఆగిపోయిన ఫీజు బకాయిలను చెల్లించడానికి బడ్జెట్ మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని మంత్రి అన్నారు. 2023-24 సంవత్సరానికి వివిధ పథకాలు ద్వారా ఉన్న బకాయిలను విలేకరులకు మంత్రి వివరించారు.

4

# మీ రాజకీయాలు మార్చుకోకుంటే క్రికెట్ టీం కాస్త..వాలీబాల్ టీం అవుతుంది..



- జగన్‌ను జనం పాతాళానికి తొక్కేసినా బుద్ది మార్చుకోలేదు
- అర్హత లేకున్నా చంద్రబాబు ఆదేశంతోనే అసెంబ్లీలో గౌరవం లభించింది
- జగన్ బెదిరింపు రాజకీయాలకు కాలం చెల్లింది
- జగన్‌కు మంత్రి గొట్టిపాటి హెచ్చరిక

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 26)

తమకు ప్రతిపక్ష హెూదా కల్పించాలంటూ ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పీకర్‌కు రాసిన లేఖపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందించారు. సభాపతిని లక్ష్యంగా చేసుకుని వక్రభాష్యంతో జగన్ లేఖ రాశారని మండిపడ్డారు. ఆయన బెదిరింపు రాజకీయాలకు కాలం చెల్లిందన్నారు. జగన్ ఇకనైనా ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయాలు చేయాలని, లేదంటే (తరువాయి 4లో...)

# రొట్టెల పండుగకు పటిష్ట ఏర్పాట్లు

- వచ్చేనెల 17 నుంచి 21వ తేదీ వరకు రొట్టెల పండుగ
- బారాషహీద్ దర్గా అభివృద్ధిలో రాజీపడే ప్రసక్తే లేదు
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ
- దేశమంతా నెల్లూరు వైపు చూసేలా రొట్టెల పండుగ
- రొట్టెల పండుగ నిర్వహణకు మాస్టర్‌ప్లాన్ తయారుచేయండి
- రాష్ట్ర దేవాదాయ,ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- ఈద్గా కమిటీ సభ్యుల సూచనలను పరిగణలోనికి తీసుకోండి
- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 26)

ప్రపంచ ప్రఖ్యాతగాంచిన బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయనున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. వచ్చే నెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న రొట్టెల పండుగకు సంబంధించిన ఏర్పాట్లపై దర్గా ప్రాంగణంలో బుధవారం మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారా యణ రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధి కారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ దర్గా అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, రొట్టెల పండుగకు (తరువాయి 4లో...)



# ప్రజాప్రతినిధుల మధ్య అట్టహాసంగా ఆర్ కె టిఫెన్ సెంటర్ ప్రారంభం



- ఆరోగ్యం పెంచుతూ మంచి రుచులను అందించాలి
- ప్రజా మన్ననలు అందుకుని దినదినాభివృద్ధి సాధించాలి
- ప్రారంభ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు

(షణ్ముఖ న్యూస్, పొదిలి జూన్ 26)

పొదిలి పట్టణంలోని పవర్ ఆఫీసు వీధిలో బుధవారం ఆర్ కె టిఫెన్ సెంటర్‌ను తెలుగుదేశం పార్టీ రాష్ట్రకార్యదర్శి గునుపూడి భాస్కర్, ఇతర ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు పెద్ద ఎత్తున హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో (తరువాయి 5లో...)

# ఎస్ఐ రజియా సుల్తానా వ్యవహారంపై విచారణ

- జరుగుమల్లి ఎస్ఐ ఇసుక దందాపై విచారణకు జిల్లా ఎస్పీ ఆదేశం
- అవినీతి ఆరోపణల పై డిఎస్పీ తప్పుడు నివేదిక పై విచారణ
- మండల మెజిస్ట్రేట్ బదులు ఎస్ఐ అక్రమ ఇసుక వేలం
- ఇసుక రవాణా దారులతో కుమ్మక్కైన ఎస్ఐ


(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జూన్ 26)

కొండపి నియోజకవర్గం జరుగుమల్లి మండల పోలీస్ స్టేషన్ నందు స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా విధులు నిర్వహించిన సమయంలో ఎస్ఐ షేక్ రజియా సుల్తానా బేగం అక్రమ ఇసుక దందా నిర్వహించిన విషయమై 2021లో జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు చేసిన ఫిర్యాదులను సక్రమంగా దర్యాప్తు చేయకుండా అప్పటి ఒంగోలు డిఎస్పీ బుట్ట దాఖలు చేశారంటూ జర్నలిస్టు ఎన్ నాగార్జున రెడ్డి జిల్లా ఎస్పీనీ స్వయంగా కలిసి ఫిర్యాదు చేశారు. అప్పటి ఫిర్యాదులపై జరుగుమల్లి పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించకుండానే రెవిన్యూ పోలీస్ అధికారులు జాయింట్ ఆపరేషన్ జరిపి పెద్ద మొత్తంలో పెనాల్టీలు వేయడమే కాకుండా కేసులు నమోదు చేశామని, ఫిర్యాదుదారుని ఆరోపణలలో వాస్తవం లేదంటూ ఫిర్యాదుదారుని ఆరోపణలలో వాస్తవం లేదంటూ ఎస్ఐ రజియా సుల్తానా బేగం కు అనుకూలంగా వ్యవహరించిన డి.ఎస్.పి పోలీస్ ఉన్నతాధికారులను తప్పుదారి పట్టిస్తూ తప్పుడు నివేదిక ఇచ్చారంటూ ఫిర్యాదులు చేశారని నాగార్జున రెడ్డి ఆరోపించారు. సదరు నివేదికతో పాటు సరైన ఆధారాలు కూడా చూపలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయడంతో నాగార్జున రెడ్డి సమాచార హక్కు చట్టం ప్రకారం జరుగుమల్లి పోలీస్ స్టేషన్ వారిని, జిల్లా పోలీసు కార్యాలయం వారిని ఫిర్యాదులపై చేపట్టిన చర్యలు తాలూకు సంబంధిత రికార్డుల తాలూకు పూర్తి సమాచారం ఇవ్వాలని ప్రయత్నించినప్పటికీ పోలీసు అధికారులు సహకరించకపోవడంతో రాష్ట్ర సమాచార కమిషన్‌ని నాగార్జునరెడ్డి ఆశ్రయించారు. సమాచార కమిషన్ ఆదేశాల మేరకు జరుగుమల్లి పోలీస్ స్టేషన్ రికార్డులు పరిశీలించిన తర్వాత ఎస్ఐ రజియా సుల్తానా బేగం చేసిన ప్రస్తుత బాలుకు వాస్తవం భయంకమైనయని, డీఎస్పీ నివేదికకు, ప్రస్తుత జరుగుమల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ నివేదికకు జరుగుమల్లి మండల తాసిల్దార్ కార్యాలయం వారి నివేదికకు పొంతనలేని (తరువాయి 4లో...)



# ప్రజా సంక్షేమ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తా





పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ ల పథకం క్రింద మొత్తం రూ.2,505.56 కోట్లు ఉండగా ఎస్.సి విద్యార్ధులకు రూ.131.82 కోట్లు వసతి నిర్వహణ రుసుము క్రింద బకాయిలు మొత్తం రూ.895 కోట్లు ఉండగా ఎస్.సి విద్యార్ధులకు రూ.90.00 కోట్లు హాస్టల్ బిల్స్ మొత్తం రూ.20.71 కోట్లు, పి.ఎం.ఈ.జి.వై పథకం క్రింద రూ.62.30 కోట్లు ఎన్.టి.ఆర్ విద్యోన్నతి పథకం క్రింద మొత్తం రూ.1.99 కోట్లు అంబేడ్కర్ విదేశీ విద్యా పథకం క్రింద రూ.5.69 కోట్లు, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం క్రింద రూ.60.10 కోట్లు, ఎస్సీ, ఎస్టీస్ చట్టం మానిటరీ రిలీఫ్, కులాంతర వివాహాల (ఎస్సీస్) కొరకు మొత్తం రూ.21.87 కోట్లు స్థూలంగా అన్ని పథకములకు విడుదల కావలసిన మొత్తం రూ.3,573.22 కోట్లు అని, ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సొసైటీకి చెందిన బిల్లులు 2019-24 వరకు మొత్తం రూ.243.34 కోట్లు ఉన్నాయని మంత్రి వివరించారు. సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా షెడ్యూల్డ్ కులాల సమగ్ర అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని, వికలాంగులకు ప్రత్యేక పాఠశాలలు, హాస్టళ్లు, స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయడమే కాకుండా, వారికి జీవనోపాధి కల్పించేందుకు ప్రణాళికలు తయారు చేస్తామని, వయో వృద్ధుల సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, గ్రామ వార్డు, సచివాలయాల ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి కె. హర్ష వర్ధన్, ఇతర అధికారులు, ఉద్యోగులు మంత్రి స్వామిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలతో అభినందనలు తెలిపారు.

# మదర్ సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థినికి సహాయం



(షణ్ముఖ వెలుగు, పీసీపల్లి, జూన్ 26)

మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన గుండబత్తిన కొండలు, రమణమ్మ అను వారు కూలి పని చేసుకుని జీవిస్తున్నారు. గత సంవత్సరం వారు నివసించుచున్న పూరి గుడిసె మంటలకు అంటుకుని పూర్తిగా కాలిపోవడంతో నిరాశ్రయులయ్యారు. వారి కుమార్తె లావణ్య పదవ తరగతిలో మంచి మార్కులు సాధించగా వారి ఉపాధ్యాయులు, కొంత మంది వారి పరిస్థితిని మదర్ సేవా సమితి దృష్టికి తేవడం జరిగింది. వెంటనే స్పందించిన మదర్ సేవా సమితి సభ్యులు విజేత ఐఐటీ అండ్ నీట్ అకాడమీ యాజమాన్యంతో మాట్లాడారు. కాలేజీ వారు ఇంటర్మీడియట్ కోర్స్‌కు అయ్యే ఫీజును పూర్తి ఉచితంగా అందిస్తామని తెలిపారు. అలాగే విద్యార్థినికి మదర్ సేవా సమితి వారు రూ.5000లు ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కృష్ణ చైతన్య చేతుల మీదుగా పుస్తకాలు, ఇతర సామాగ్రికి అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మదర్ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ ఎన్ రసూల్, విజేత కాలేజీ కరెస్పాండంట్ పసుపులేటి అరుణధర్, గౌరవాధ్యక్షులు సయ్యద్ యాసిన్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, లాయర్ పాశం పిచయ్య, ఏబి క్లినిక్ నిర్వాహకులు షేక్ నాయబ్ రసూల్, కో ఆప్షన్ సభ్యులు గూడూరి అబ్రహం లింకన్, మాజీ కో ఆప్షన్ మెంబర్ పీర్ల మస్తాన్ వలి, కనిగిరి నియోజకవర్గ బిసి సంఘ నాయకులు కేతనబోయిన పెద్దన్న, ఈర్ల విజయరామరాజు, ఆర్ఎంపి డాక్టర్ ద్రోనాధుల చెంచులు, చెరుకూరి కాశయ్య, ఎల్ఐసి వెంకటనారాయణ, మదర్ సేవాసమితి కోశాధికారి కోమటిగుట్ల బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐ రజియా సుల్తానా వ్యవహారంపై విచారణ

విషయాలు బహిర్గతమయ్యాయని ఫిర్యాదులో తెలిపారు. జరుగుమల్లి మండల పోలీస్ స్టేషన్ నందు స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా అధికార విధులు నిర్వహించిన సమయంలో ఎస్ఐరజియా సుల్తానా బేగం అక్రమ ఇసుక రవాణా చేస్తూ పట్టుబడిన ట్రాక్టర్లు లారీలు మరియు ఎడ్ల పనులు సంబంధించి, పట్టుబడిన అక్రమ ఇసుకను మండల మెజిస్ట్రేట్ వారికి హ్యాండ్ ఓవర్ చేయకుండా, సంబంధిత అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవహరించిన ఎస్ఐ రజియా సుల్తానా బేగం పట్టుబడిన యావత్తు వాహనాలలోని అక్రమ ఇసుకను తన సొంత మధ్యవర్తులను ఏర్పాటు చేసుకొని తప్పుడు రికార్డులు సృష్టించి సదరు ఇసుకను ఎప్పటికప్పుడు అమ్మకాలు జరిపి అక్రమాలకు పాల్పడిన విషయమై ఎస్ఐ రజియా సుల్తానా బేగం మరియు ఆమెకు సహకరించిన పోలీసు ఉన్నతాధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని పోలీసు వ్యవస్థ పై ప్రజలకు విశ్వాసం కలిగించే విధంగా చర్యలు తీసుకోవాలని నాగార్జున రెడ్డి జిల్లా ఎస్పీని కోరారు. ఫిర్యాదులు పరిశీలించిన జిల్లా ఎస్పీ సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక సమర్పించాలని అడిషనల్ ఎస్పీ (క్రైమ్) వారిని ఆదేశించారని నాగార్జునరెడ్డి తెలిపారు.

# మీ రాజకీయాలు మార్చుకోకుంటే క్రికెట్ టీం కాస్త..వాలీబాల్ టీం అవుతుంది..

ఇప్పుడున్న క్రికెట్ టీం కాస్తా వాలీబాల్ టీం అవుతుందని ఆయనకున్న ఎమ్మెల్యేలను గుర్తుచేస్తూ హెచ్చరించారు. జగన్‌ను ప్రజలు పాతాళానికి తొక్కేశారని, అయినప్పటికీ చంద్రబాబు పెద్దమనసుతో ఆయనకు గౌరవం ఇవ్వాలని ఆదేశించారని, అర్హత లేకున్నా గౌరవం లభించింది అందుకేనని గుర్తుచేశారు. ఆయన వాహనాన్ని కూడా లోపలికి అనుమతించారని పేర్కొన్నారు. అయినప్పటికీ స్పీకర్‌ను లక్ష్యంగా చేసుకుని లేఖ రాసి తన బుద్ధి మారలేదని నిరూపించుకున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రొట్టెల పండుగకు పటిష్ట ఏర్పాట్లు





వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్యం, స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. రానున్న రోజుల్లో దర్గాను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. 2014లో తాను మంత్రిగా ఉన్న సమయంలో దర్గా అభివృద్ధికి ఎంతగానో కృషి చేశామన్నారు. రొట్టెల పండుగ కోసం వచ్చే భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించి దర్గా సమీపంలో మరుగుదొడ్ల నిర్మాణం, ఘాట్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం మొదల్కెన మౌలిక వసతులు కల్పించామన్నారు. 2015 నుండి భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందని 2014లో కేవలం 4 లక్షల మంది భక్తులు వస్తే అది 2017 కి 20 లక్షలకు చేరుకుందని గుర్తు చేశారు. కృష్ణ, గోదావరి పుష్కరాలకు గతంలో తాను సమన్వయకర్తగా వ్యవహరించానని, అప్పటి అనుభవాల దృష్టిలో పెట్టుకుని నెల్లూరు బారాషహిద్ దర్గా, స్వర్ణాల చెరువు మరింత అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. టెండర్ల ద్వారా దర్గాకు వస్తున్న ఆదాయాన్ని దర్గా అభివృద్ధికి ఇచ్చేలా ఆర్థికశాఖ అధికారులతో సంప్రదింపులు చేస్తున్నట్లు చెప్పారు. 400 సంవత్సరాలకు పైగా సుదీర్ఘ చరిత్ర కలిగిన పవిత్రమైన దర్గాకు దేశ విదేశాల నుండి భక్తులు కులమతాలకతీతంగా రావడం శుభ పరిణామం అన్నారు. ప్రస్తుతం నిధుల కొరత ఉన్నందున భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇస్తున్నానని మంత్రి నారాయణ ప్రకటించారు. నగర కమిషనర్ వికాస్ మరమ్మత్ నేతృత్వంలో భక్తులకు తాగునీరు, శానిటేషన్ తదితర సౌకర్యాలను పరిశీలించామన్నారు.ముఖ్యంగా దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు పార్కింగ్ స్థలాలను పరిశీలించి ఏర్పాటు చేయాలని పోలీసు శాఖకు సూచించారు. అగ్నిమాపక శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని అవసరమైతే మరిన్ని ఫైర్ ఇంజన్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.అలాగే విద్యుత్ షార్ట్ సర్క్యూట్లు జరగకుండా దర్గా పరిసర ప్రాంతాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. రొట్టెల పండగ పూర్తయిన అనంతరం ఎక్కడి వారు అక్కడికి వెళ్లకుండా చిన్న కాగితం ముక్క కూడా లేకుండా దర్గా ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచి వెళ్లాలన్నారు. ఫుడ్ కోర్టులను నిర్దేశించిన స్థలాల్లోనే ఏర్పాటు చేయాలని, పోలీస్ కంట్రోల్ రూమ్‌లను ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

**దేశం మొత్తం నెల్లూరు వైపు చూసేలా రొట్టెల పండుగ : మంత్రి ఆనం**

దేశం మొత్తం నెల్లూరు వైపు చూసేలా రొట్టెల పండుగను నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. అధికారులందరూ సెలవులు రద్దు చేసుకుని రొట్టెల పండుగ విధుల్లో అంకితభావంతో పాల్గొనాలని సూచించారు. రొట్టెల పండుగ నిర్వహణకు ప్రత్యేక మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని అధికారులకు సూచించారు. బారాషహీద్ దర్గాకు విచ్చేసే భక్తులు ఉమ్మడి నెల్లూరుజిల్లాలోని ప్రసిద్ధి చెందిన కసుమూరు, అనుమసముద్రంపేట, వేనాడు దర్గాలను కూడా సందర్శిస్తారని, ఇక్కడ కూడా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రధానంగా పారిశుద్ధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలపై దృష్టి సారించాలన్నారు. మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డితో కలిసి దర్గా అభివృద్ధి విషయమై ముఖ్యమంత్రితో మాట్లాడి నిధుల విడుదలకు కృషి చేస్తామనని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

ఈద్గా కమిటీ సభ్యుల సూచలను పరిగణలోకి తీసుకోవాలి

**ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**

రొట్టెల పండుగ నిర్వహణలో ఈద్గా కమిటీ సభ్యుల సూచనలను పరిగణలోకి తీసుకుని ఏర్పాట్లు చేపట్టాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధికారులకు సూచించారు. ప్రపంచ ప్రఖ్యాతగాంచిన నెల్లూరు రొట్టెల పండుగను అంగరంగ వైభవంగా, సర్వాంగ సుందరంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా చేపట్టాలని పేర్కొన్నారు. దర్గా ప్రాంగణంలో భక్తులు ఐదుపూటల ప్రార్థనలు చేసుకునేలా అన్ని సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. దర్గా పరిసరాల్లో ఎటువంటి రాజకీయపరమైన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని, ఎవరైనా ఏర్పాటు చేస్తే వెంటనే తొలగించాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. తొలుత మున్సిపల్ కమిషనర్ వికాస్, ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ రొట్టెల పండుగకు చేపడుతున్న ఏర్పాట్లను మంత్రులకు వివరించారు. గత సంవత్సరం కంటే మిన్నగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం దర్గా ఆవరణలోని ఘాట్ పరిసర ప్రాంతాలను ప్రజా ప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. ఈ సమావేశంలో డిఆర్‌వో లవన్న, ఏఎస్పీల సౌజన్య, శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసరావు, ఆర్డీవో మలోల, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మాజీ మేయర్లు అబ్దుల్ అజీజ్, భానుశ్రీ, అనూరాధ, నుడా మాజీ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, స్థానిక నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఈద్గా కమిటీ సభ్యులు, పలువురు జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



## ప్రజాప్రతినిధుల మధ్య అట్టహాసంగా

# ఆర్ కె టిఫెన్ సెంటర్ ప్రారంభం










పట్టణంలోని పలువురు రాజకీయ ప్రజాప్రతినిధులు పాల్గొని నిర్వాహకులు ఓబులశెట్టి రాధాకృష్ణ, బివి నాగార్జునకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణంలో ఇప్పటి వరకు ఎవరూ ఏర్పాటు చేయని విధంగా మిల్లెట్ దోశలు, ఇడ్లీలో పలు రకాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం మంచిదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు మిల్లెట్ పై ఆశక్తి చూపుతున్నారని, వాటికి తగ్గట్టుగా మీరు ప్రజలకు రుచికరమైన వాటిని అందించాలని ఆకాంక్షించారు. అనతి కాలంలోనే ప్రజల మన్ననలు అందుకుని వారికి మంచి రుచికరమైన, నాణ్యమైన వంటకాలు అందించాలన్నారు. అనంతరం నిర్వహకులను నాయకులు ఆశీర్వదించారు. తదుపరి ఏర్పాటు చేసిన విందును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి శాసనాల వీరబ్రహ్మం, మాజీ సర్పంచ్ కాటూరి నారాయణ ప్రతాప్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, ముస్లిం మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, ముల్లా ఖుద్దూస్, మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, మాజీ వార్డు సభ్యులు జ్యోతి మల్లిఖార్జున, మాజీ ఎంపిటిసి సభ్యులు సయ్యద్ ఇమాంసా, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్రకార్యదర్శి ఎస్ ఎం భాష, మాజీ వైస్ సర్పంచ్ షేక్ జిలాని, మర్రిపూడి ఎంపిపి వాకా వెంకటరెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటిసి సభ్యులు వి సాయి రాజేశ్వరరావు, క్లాస్ ఒన్ కాంట్రాక్టర్ కల్లం వెంకట సుబ్బారెడ్డి, శివాలయం కమిటీ మాజీ ఛైర్మన్ యక్కలి శేషగిరిరావు, రోటి యస్థాన్, ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులు గునుపూడి చెంచు సుబ్బారావు, మాజీ శివాలయం కమిటీ మెంబర్ సోమిశెట్టి చిరంజీవి, టీడీపీ మహిళా నాయకురాలు సోమిశెట్టి శ్రీదేవి, న్యాయవాది స్వర్ణ వెంకటేశ్వర్లు, పందిటి మురళీ, పొదిలి ఎస్ఐ జి కోటయ్య, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మారుతీరావు, డిఆర్‌సిసి మాజీ మెంబర్ ఎంఎన్‌రెడ్డి, గోపినాధుడు, ఉబ్బా అశోక్, చంటి యాదవ్, ఇతర నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.















































# జిల్లా ప్రధాన సమస్యల పరిష్కారానికి నూతన ప్రభుత్వాలు శ్రద్ధచూపాలి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 26)

జిల్లా ప్రధాన సమస్యల పరిష్కారానికి నూతన ప్రభుత్వాలు శ్రద్ధ చూపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి కొండారడ్డి, కంకణాల ఆంజనేయులు కోరారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రకాశం జిల్లా కమిటీ సమావేశంలో పలు తీర్మాణాలు చేశారు. జిల్లాలో నూతనంగా ఎన్నికైన పార్లమెంట్, శాసన సభ్యులకు, జిల్లాకు చెందిన నూతన మంత్రికి సమావేశం అభినందనలు తెలియజేసింది. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంతో వున్న సానుకూలతను ఉపయోగించుకొని జిల్లా అభివృద్ధికి, పెండింగ్ సమస్యల పరిష్కారానికి, ఇచ్చిన హామీల అమలుకు కృషి చేయాలని సిపిఐ (యం) కోరుతున్నది. కొన్ని తక్షణ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. ఉపాధి హామి పనులు జూన్ 4 నుండి నిలిచిపోయాయి. ఈ కాలంలోనే వ్యవసాయ కూలీల ఉపాధికి ఎంతగానో తోడ్పడే ఈ పథకం ఆగిపోవటం ఆందోళనకరం. తక్షణమే పనులను పునురుద్ధరించి కూలీలను ఆదుకోవాలన్నారు. ఎండలు తగ్గకపోవడం, ధీర్ఘకాలం నుండి పెండింగ్‌లో వున్న త్రాగునీటి సమస్యలు తీవ్రతరమైతున్నాయి. జిల్లా అంతటా త్రాగునీటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నామన్నారు. గత రబీలో కరువు కారణంగా పంటలు నష్టపోయిన రైతుల గురించి అధ్యయనానికి కరువు బృందం ఇటీవల జిల్లాలో పర్యటించింది. జిల్లాలోని 22 మండలాల్లో 29, 713 హెక్టార్లలో పంటనష్టపోయిన 36,147 మందిని రైతులను ఆదుకొనేందుకు తక్షణ సహాయం విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మధ్యాహ్న భోజన పథకం, స్కూల్ స్వీపర్లు, ఉపాధిహామీ ఫీల్ అసిస్టెంట్ల, విఓఏ తదితర కార్మికులను తొలగించాలని కసరతుత్తచేస్తున్నారు. వారి ఉద్యోగ భద్రతకు ముప్పు వచ్చింది. ఇవన్నీ రాజకీయ నియామకాలు కాదు. చిరుఉద్యోగులపై రాజకీయ వేధింపులు చేయడం సరికాదు. తొలగింపులను ఆపాలని కోరుతున్నామన్నారు. వీటితోపాటు ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చి, జిల్లా అభివృద్ధికి కేంద్ర,




రాష్ట్రప్రభుత్వాలు 10వేల కోట్ల రూపాయల ప్రత్యేక ప్యాకేజీ, నూతన జిల్లా ఏర్పాటు పాలనా సౌలభ్యం కొరకు మార్కాపురం కేంద్రంగా నూతన జిల్లాను ఏర్పాటు చేయాలన్నారు. దొనకొండ పారిశ్రామిక కారిడార్, కనిగిరి నిమ్, వాన్పిక్‌లలో పరిశ్రమలు, ప్రకటించిన ఫుడ్, ఆక్వా, వెజిటబుల్ ప్రాసెస్ యూనిట్లను ఏర్పాటు చేసి ఉపాధి, వలసల నివారణ. కొత్తపట్నం హార్బర్, ఒంగోలు డైరీని సహకార రంగంలోనే నడపటం, సంక్షోభంలో వున్న గ్రానైట్, పలకల పరిశ్రమను కాపాడి, కార్మికుల ఉపాధిని నిలబెట్టాలన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పనులు పూర్తి, నీటి విడుదల, ప్రాజెక్టుకు నికర జలాలు కేటాయింపు. నిర్వాశితులకు పునరావాస ప్యాకేజి చెల్లించడం. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు రిపేర్లు. నిలిచిపోయిన సంఘమేశ్వరం, పాలేటిపల్లి రిజర్వాయర్ల పనులు ప్రారంభించడం. మొగిలిగుండాల రిజర్వాయరు, పి. బి. ఛానలు రిపేరు, చీతిరాళ్ల కత్తువ చెక్కుడాం పూర్తి. జిల్లాలోని లిఫ్ట్ ఇరిగేషన్లు, చెక్ డ్యామ్లు, చెరువులను, ఇతర నీటివనరులను అభివృద్ధి చేసి సాగునీరు అందించాలన్నారు. ప్రభుత్వ భూములుగా గుర్తించిన 1 లక్ష 30వేల ఎకరాలను భూమిలేని వ్యవసాయ కూలీలు, కౌలురైతు కుటుంబాలకు 3 ఎకరాల చొప్పున పంపిణీ. అన్యాక్రాంతానికి గురైన అసైన్డ్ భూములను అర్హులైన పేదలకు ఇవ్వడం, సుబాబుల్, జామాయిల్, సరుగుడుకు గిట్టుబాటు ధర కల్పన, కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలన్నారు. అర్హులైన పేదలందరికీ ఇండ్లస్థలాలు కేటాయించడం. జగనన్న కాలనీలు, టిడ్కో ఇళ్ళను పూర్తి చేయాలని, ప్రతి కుటుంబానికి సరిపడా రక్షిత మంచినీరు అందించటం. ఒంగోలు, కనిగిరి, దరిశి, పొదిలి, చీమకుర్తి, కొత్తపట్నంలో మంజూరైన నీటిపథకాలను నిర్మాణం, ప్రజలను నీటివ్యాపారం భారం నుండి కాపాడాలన్నారు. 729 గ్రామాల్లో వున్న ఫ్లోరైడ్ నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఒంగోలు రిమ్స్ సూపర్ స్పెషాలిటీ సేవలు ప్రారంభించడం. మార్కాపురం మెడికల్ కాలేజి నిర్మాణ పనులు వేగవంతం చేసి 2024-25 విద్యా సంవత్సరానికి ప్రారంభించడం. దోర్నాల గిరిజన సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి నిర్మాణం, ఒంగోలులో ఇ.ఎస్.ఐ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రకాశం యూనివర్శిటీని అన్నీ కోర్సులతో తరగతులు, హాస్టల్సు ప్రారంభించడం. ట్రిబుల్ ఐ.టి కాలేజీకి సొంత భవనాలు నిర్మించడం. జిల్లాలో జెయన్టియుకి అనుభంధంగా ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజిని ఏర్పాటు. ప్రభుత్వ రంగంలో బిఇది, పాలిటెక్స్, ఐటిఐలను ప్రారంభించాలని, నడికుడి- శ్రీకాళహస్తి రైల్వేలైన్ పనులను దరిశి నుండి పామూరు వరకు పూర్తిచేయడం. ఒంగోలు నుండి మార్కాపురం వరకు, శింగరాయకొండ నుండి కంభం వరకు రైల్వే లైన్లు ఏర్పాటు. ప్రతి గ్రామానికి ఆర్టీసి బస్సులు నడపాలన్నారు. మౌలిక సదుపాయాలు నివాస ప్రాంతాల్లో రోడ్లు, సైడుకాల్వలు, కల్వర్టులు, విద్యుత్, వీధిలైట్లు, మంచినీరు వగైరా మౌలిక సదుపాయాలు కల్పిన. పారిశుద్యాన్ని మెరుగుపరచడం. దెబ్బతిన్న రోడ్లను రిపేర్లు చేయటం, సామాజిక తరగతులు జిల్లాలో మహిళలు, దళితులు, గిరిజనులపై పెచ్చరిల్లుతున్న దాడులను అరికట్టడం. వారి రక్షణకు వున్న చట్టాలను పగడ్బందీగా అమలు, వృత్తిదార్లకు రక్షణ, ఉపాధి, గిరిజన తండాల్లో మౌళిక వసతులు కల్పన, ఐటిడిఏ, మైదాన గిరిజన ఉపకార్యాయాలను జిల్లాలో ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, జివి కొండారెడ్డి పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా వుంటా ఎమ్మెల్యే బూచేపల్లి





(షణ్ముఖ వెలుగు, దర్శి ఇన్‌ఛార్జి, జూన్ 26)

నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. బుధవారం దర్శి పర్యటించిన బూచేపల్లి కొత్తపాలెంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన పార్టీ కార్యకర్త నాగార్జున కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రాజంపల్లి గ్రామంలో పార్టీ నాయకులు గొర్ల గోపాల్ ఇటీవల గుండెకు స్టంట్ వేయించుకొని ఇంటికి రాగా బూచేపల్లి పరామర్శించారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంది అండగా ఉంటానని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వెన్నపూస వెంకటరెడ్డి, మిల్లర్ బుజ్జి, వైసిపీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అంటు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 26)

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ తెలిపారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో ఇంజనీరింగ్, శానిటేషన్ సెక్షన్ వారితో సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో ప్రజలకు అంటు వ్యాధులు వచ్చు అవకాశం ఉన్నందున, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పైపు లీకేజీలను అరికట్టాలన్నారు. రోజువారీ నీటి సరఫరాను పర్యవేక్షించాలని, ప్రజలకు ఎలాంటి అవాంతరాలు లేకుండా నీటి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. వార్డు అమెనిటీస్ సెక్రెటరీల ద్వారా రెసిడ్యుల్ క్లోరిన్ పరీక్షలను సక్రమంగా నిర్వహిస్తూ నీటి నాణ్యతను తనిఖీ చేయించాలని తెలియజేశారు. నగరంలోని పాట్ హెూల్స్ గుర్తించి, పాట్ హెూల్స్ ప్యాచ్ పనులకు తక్షణమే ఎస్టిమేట్లు సిద్ధం చేసి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు. వీధి దీపాలను పర్యవేక్షించి, ఎక్కడైనా లైట్లు వెలగకపోతే తక్షణమే మరమ్మతులు చేయించాలని, వీధి దీపాలు ఆగిపోవడంపై ప్రజల వద్ద నుండి ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులను ఆదేశించారు. రాబోవు వర్ష కాలమును దృష్టిలో పెట్టుకుని నగరంలో కాలానుగుణ వ్యాధులు, అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు, కాలువల్లో సిల్ట్ తొలిగించుట ప్రతి రోజు తూచాతప్పకుండా నిర్వహించవలెనని శానిటేషన్ సెక్షన్ అధికారులను ఆదేశించారు. ప్రజల నుండి ఎలాంటి ఫిర్యాదుల రాకుండా, అసౌకర్యం కలగకుండా పారిశుధ్య పనులు నిర్వహించాలని తెలియచేసారు.

## స్పీకర్ ఓం బిర్లాకు అభినందనలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 26)

రెండవ సారి లోక్ సభ స్పీకర్‌గా ఎన్నికైన సందర్భంగా ఓం బిర్లాని ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల బొకే అందజేసి ఆయనకు శు భాకాంక్షలు తెలియజేశారు.



# మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాసమస్యల పై ధ్వజమెత్తిన ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్





(షణ్ముఖ వెలుగు, పామూరు, జూన్ 26)

పామూరు మండల సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు ఎంపీపీ గంగసాని లక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు ప్రజా సమస్యలపై అధికారులపై పట్టణ రెండవ ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ ధ్వజమెత్తారు. ముఖ్యంగా 167బి హైవేలో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం నేటికీ అందలేదని, మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, 29 రెవెన్యూ గ్రామాలు డిజిటల్ సర్వే చేసేందుకు ఉపయోగించే రోవర్స్ కొరత ఏర్పడినందువల్ల సకాలంలో భూముల కొలతలు చేయలేక రైతులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ముఖ్యంగా 6000 ఎకరాలకు సంబంధించి జీరో ఖాతాను పునరుద్ధరించి ఆన్లైన్ జరిపి పాసుబుక్కులు రావడం వలన అన్నదాత సుఖీభవ పాలసీకి అర్హులవుతారని అందువల్ల బ్యాంకులలో లోన్లు తీసుకొనుటకు రైతులకు అవకాశం కలుగుతుందని, అంకాలమ్మ వీధిలోని బాలసుబ్బయ్య నగర్ లో గల ప్రాథమిక పాఠశాల భవనం నిర్మాణం చివరి దశలో ఆగిందని ప్రస్తుతం ప్రైవేటు అద్దె భవనంలో క్లాసులు నిర్వహణ జరుగుతుందని , అందువల్ల విద్యార్థులకు పూర్తి సౌకర్యాలు సమకరణం లేదని త్వరగా పాఠశాల నిర్మాణం పూర్తి చేయాలని, మయూరి లాడ్జి వద్ద నుండి విరాట్ నగర్ 565 హైవే వరకు డబల్ రోడ్డు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈ రోడ్లో ఎన్నో యాక్సిడెంట్లు జరిగాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి డబల్ రోడ్డు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంకాలమ్మ వీధిలో పలుచోట్ల రోడ్లు, విద్యుత్ స్తంభాలు స్తంభాలు లేక పలు కుటుంబాలు అంధకారంలో ఉంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆకుపాటి వెంకటేష్ లేవనెత్తిన పలు సమస్యలపై కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అలసత్వం వహిస్తే సహించేది లేదని అన్నారు. అధికారులు గత వైసిపి పాలనలో లాగా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పామూరు మండలంలోని పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

## ఛలో వరంగల్ కవాతు జయప్రదం చేయాలి

ఏంఈఎఫ్



(షణ్ముఖ వెలుగు, దర్శి ఇన్‌ఛార్జి, జూన్ 26)

మహాజన నేత మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఛలో వరంగల్‌లో జరుగు కవాతుకు సంబంధించి దర్శి నియోజకవర్గం ఏంఈఎఫ్ ఉద్యోగుల సమావేశం దర్శిలో నిర్వహించారు. అధ్యక్షులు సూచనలు పాటించి జూలై 7వ తేదీ జరుగు కవాతును విజయవంతం చేయుటలో తమ వంతు పాత్ర ను నిర్వహిస్తామని ఉద్యోగులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి భిక్షాలు మాదిగ, రాష్ట్ర నాయకులు రవిరాజ్ మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి టి శేషయ్య మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు మాదిగ, జిల్లా కార్యదర్శి విక్రమ్ మాదిగ, ఏంఈఎఫ్ నియోజకవర్గ భాధ్యులు నూనె పాల్ గాంధీ, యు అంకయ్య, బాల నాగేశ్వరరావు, వి విజయ్, కిషోర్ బాబు, ఏంఈఎఫ్ నాయకులు ఫణీంద్ర, బాజీ, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే విజయ్ కుమార్ కు అభినందనలు



(షణ్ముఖ వెలుగు, సంతనూతలపాడు, జూన్ 26)

సంతనూతలపాడు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా బుధవారం మద్దిపాడు మండల యువనాయకులు వడ్డెంపూడి శివరామకృష్ణ హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ ఇంట వారిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో ఏ ఒక్క అభివృద్ధి పని జరగలేదని, అన్ని స్కాములే జరిగాయని అన్నారు. గాడి తప్పిన నియోజకవర్గ అభివృద్ధిని గాడిలో పెట్టి తనదైన ముద్ర వేసుకోవాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధిలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి రాష్ట్రంలోనే అగ్రగామిగా సంతనూతలపాడుని నిలబెడతారన్న ఆశాభావాన్ని శివరామకృష్ణ వ్యక్తం చేసారు.

# జిల్లా విద్యాశాఖాధికారులు ఎస్జీటీ పోస్టుల సంఖ్యను తేల్చాలి

కెవి పిచ్చయ్య



(షణ్ముఖ వెలుగు, దర్శి ఇన్‌ఛార్జి, జూన్ 26)

జిల్లాలో ఎస్జిటి టీచర్ పోస్టులను పెంచాలి అని డివైఎఫ్ఐ పోరాట ఫలితమే మెగా డిఎస్సి అని టీచర్ పోస్టుల్ని పెంచకపోతే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కేవి పిచ్చయ్య అన్నారు. బుధవారం దర్శిలోని సుందరయ్య భవన్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ జిల్లాలో ఎస్జీటీ పోస్టులు ఎన్ని ఖాళీలు ఉన్నాయో జిల్లా విద్యాశాఖ అధికారులు తేల్చి రాతపూర్వకంగా ఇవ్వాలని అయన కోరారు. భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ చేసిన పోరాట ఫలితమే మెగా డిఎస్సి నీ విడుదల చేశారని కానీ ప్రకాశం జిల్లాలో కేవలం 124 ఎస్జిటి పోస్టుల్ని భర్తీ చేస్తామని వివిధ పత్రికల్లో వార్తలు వస్తున్నాయని కానీ నిజంగా జిల్లాలో ఎస్జీటీ పోస్టులు దాదాపు 1000 దాకా ఖాళీలు ఉన్నాయని అయన తెలిపారు. జిల్లాలో ఖలీగా ఉన్న ఎస్జీటీ ఖలీలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికయిచ్చి మెగా డిఎస్సీలో చేర్చేవిధంగా చూడాలని లేనిపక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లాలో డీఎస్సీ అభ్యర్థుల తోటి నిరుద్యోగులు తోటి ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు ఆర్ జె సి పాల్, నాయకులు కే వెంకట్రావు, షేక్ పీరా సాహెబ్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# స్నేహశీలికి అశ్రునివాళి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 26)
మంచి మిత్రులు, స్నేహశీలి, సీనియర్ రాజకీయ నాయకులు కిలారి వెంకటస్వామి నాయుడు ఆకస్మిక మృతి అత్యంత బాధాకరమని వైసీపీ నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నానన్నారు. మిత్రులు కిలారి వెంకటస్వామి నాయుడు మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

# కిలారి మృతి బాధాకరం

## టీడీపీ సీనియర్ నాయకులు కిలారి వెంకటస్వామి నాయుడు లేని లోటు తీరనిది

## దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 26)
తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వెంకటస్వామి నాయుడు మృతి ఎంతో బాధాకరమని పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ విచారం వ్యక్తం చేశారు. టిడిపిలో ఎంతో క్రియాశీలకంగా పని చేశారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. కిలారి వెంకటస్వామి నాయుడు లేని లోటు టిడిపికి తీరనిదన్నారు. ఆయన మృతి విషయం తెలుసుకుని దిగ్భ్రాంతి వ్యక్తం చేసి సంతాపం తెలియజేశారు. ఆయన కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ భరోసా ఇచ్చారు.

# అందరికీ అందుబాటులో ఉండేలా రైతు బజార్

## కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 26)
కనిగిరి ప్రజలకు అందుబాటులోకి రైతు బజార్ ను తీసుకురావడం జరుగుతుందని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలియజేశారు. కనిగిరి పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం ప్రాంగణం సమీపంలో మార్కెటింగ్ శాఖ నిధులు రూ 95 లక్షలతో నిర్మించనున్న రైతు బజార్ కు బుధవారం సాయంత్రం ఆయన భూమిపూజ నిర్వహించారు. రైతులకు గిట్టుబాటు లభించడంతోపాటు ప్రజలకు నాణ్యమైన కూరగాయలు దొరుకుతాయని తెలిపారు. దళారులు లేకుండా రైతులు వ్యాపారాలు నిర్వహించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. విజయదశమి కి రైతు బజారు అందుబాటులోకి వచ్చేలా నిర్మాణాలు వేగవంతం చేయాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సాల్మన్ రాజు, టిడిపి పట్టణ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, మండల అధ్యక్షులు నంబుల వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు రాచమల్ల శ్రీనివాసరెడ్డి, ముచ్చుమారి చెంచిరెడ్డి, క్రాంతి శీను, నారపరెడ్డి శ్రీనివాసరెడ్డి, షేక్ ఫిరోజ్, షేక్ అహ్మద్, ఐ వి నారాయణ, జేబీవీ సద్గురు మూర్తి, కోటా సురేష్, అచ్చాల రవి, తమ్మినేని సురేంద్ర రెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, నారపరెడ్డి వెంకటరెడ్డి, కొట్టే ప్రసాద్, శ్రీను, మార్కెటింగ్, మున్సిపల్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మంత్రులను కలసి అభినందనలు తెలిపిన గొట్టిపాటి లక్ష్మి







(షణ్ముఖ వెలుగు, దర్శి ఇన్‌ఛార్జి, జూన్ 26)
దర్శి నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి నేత డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి బుధవారం ఏపీ సచివాలయంలో కొందరు రాష్ట్ర మంత్రులను కలసి అభినందనలు తెలియజేసారు. రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామి బుధవారం ఏపీ సచివాలయంలో మంత్రిగా బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా గొట్టిపాటి లక్ష్మి మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సీనియర్ నాయకులకు మంత్రి పదవులు ఇవ్వటం సంతోషంగా ఉందని దర్శి అభివృద్ధికి మేలు చేకూరుతుందని ఆమె అన్నారు. అనంతరం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రివర్యులు బీసీ జనార్ధన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దర్శి నియోజకవర్గంలో రోడ్ల స్థితి గతులపై చర్చించారు. నియోజకవర్గంలో రోడ్లన్నీ అధ్వాన్నంగా ఉన్నాయని సంబంధిత అధికారులద్వారా రోడ్లను సహకరించాలని కోరారు. అందుకు మాతృవర్యులు సానుకూలంగా స్పందిస్తూ నియోజకవర్గంలో రోడ్లపై త్వరలో ఎస్టిమేట్లు తయారుచేసి పంపాలని మంత్రి కోరారు. దర్శి అభివృద్ధిలో భాగమైన రోడ్ల అభివృద్ధి ముఖ్యమైన అంశంగా ఆనాడు మన ప్రియతమ ముఖ్యమంత్రి ఎన్నికల సందర్భంగా ప్రజలకు దర్శి అభివృద్ధికి ఇచ్చిన హామీలలో భాగంగా నేడు కోరటం జరిగిందని అన్నారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు, సీనియర్ టిడిపి నాయకులు, రాష్ట్ర టిడిపి పార్టీ మాజీ అధ్యక్షులు కింజవరపు అచ్చంనాయుడు ని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత్ సాగర్ మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. దర్శి అభివృద్ధిపై మంత్రితో కొద్దిసేపు ముచ్చటించారు. దర్శి అభివృద్ధికి భవిష్యత్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అని మంత్రి అన్నారు. దర్శిలో పార్టీని పునర్ నిర్మించి పట్టు సాదించాలని అటు ప్రభుత్వం ఇటు పార్టీ లక్ష్మీకే అండగా ఉంటుందని దర్శి అభివృద్ధికి ముందుండి పనిచేయాలని మంత్రి కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ ఏపీ సచివాలయంలో సీనియర్ నాయకులను, రాష్ట్ర మంత్రులను కలవటం జరిగిందని దర్శి నియోజకవర్గంలో ఉన్న సమస్యలపై మంత్రులతో చర్చించటం జరిగిందని ఆమె తెలిపారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తామని మంత్రులు తెలుపటం చాలా సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కడియాల లలిత్ సాగర్, దర్శి మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు, నియోజకవర్గ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

సమాజంలో విద్యారంగంలో పోటీపడి రాణించండి
వ్యసనాలకు అలవాటు పడితే కఠిన చర్యలు తప్పవు
మీ నిండు జీవితాలను బలి చేసుకోవద్దు
సమాజానికి, తల్లిదండ్రులకి చెడ్డ పేరు తీసుకురావద్దు
మీ బంగారు భవిష్యత్తు ఉద్యోగాల పై పోటీపడి సాధించుకోండి
పిఎన్‌సిఏ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులచే
ప్రతిజ్ఞ చేయించిన సెబ్ సిఐ నరహరి





(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, జూన్ 26)
మండలంలోని సోమరాజుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పి ఎన్ సి ఏ కళాశాలలో బుధవారం నాడు సింగరాయకొండ సబ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నరహరి, సిబ్బంది కళాశాల ప్రాంగణం పరిధిలో కాలేజీ యాజమాన్యం ఆధ్వర్యంలో బాల బాలికలకు ప్రత్యేకంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ నరహరి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రధానంగా యువత స్త్రీ పురుషుడు తేడా లేకుండా మొత్తం పదార్థాలకు బానిసలు ఏ ఒక్కరు కావద్దని ఆయన సున్నితంగా వారికి అర్థమయ్యే రీతిలో హెచ్చరించారు. ప్రధానంగా మీరు ఈ కళాశాలలో చదువుతున్నారంటే మీ తల్లిదండ్రులు మిమ్మల్ని ఎంతో కష్టపడి కూలి, నాలి చేసి పైసా పైసా కూడగట్టి ఆ డబ్బులను మీ పుస్తకాలకి మీ డ్రెస్సులకు తదితర వస్తు సామాగ్రి కొరకు మీకు అందిస్తూ మిమ్మల్ని బంగారు భవిష్యత్తు లాగా తమ తమ బిడ్డలను తీర్చిదిద్దే విధంగా ప్రగతి పథంలో నడిపించి గొప్ప ప్రయోజకుడుని చేద్దామని మీ తల్లిదండ్రులు ఎంతో ఆశపడతారు. ప్రతి ఒక్క బాల బాలికలు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారని సర్కిల్ ఇన్స్పెక్టర్ నరహరి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధానంగా ఇప్పుడు ఉన్న పరిస్థితులో యువత ఏ ఒక్కరు కూడా స్త్రీ పురుషుడు తేడా లేకుండా మత్తు యువత ఏ ఒక్కరు కూడా స్త్రీ పురుషుడు తేడా లేకుండా మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని తెలియజేశారు. అవగాహన కార్యక్రమం ఇక్కడ ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప విశేషమని కాలేజీ యాజమాన్యం సర్కిల్ ఇన్స్పెక్టర్ నరహరి సిబ్బంది పట్ల ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పట్టణంలో బాల, బాలికల ద్వారా ర్యాలీగా రోడ్ల మీద క్యూ కట్టి ప్రజానీకానికి అర్థమయ్యే రీతిలో శ్లోకాలు చదువుకుంటూ యువత ముందుకు కదిలి రావడం ఎంతో గొప్ప విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన సిబ్బంది, పిఎన్‌సిఏ కళాశాల యాజమాన్యం అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

# హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ అధ్యక్షులుగా కిషోర్



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 26)
హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ మార్కాపురం నియోజకవర్గ అధ్యక్షులుగా కిషోర్ కుమార్‌ను నియమిస్తూ జాతీయ అధ్యక్షులు గుండారెడ్డి మల్లిఖార్జునరెడ్డి బుధవారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ మాట్లాడుతూ తన పై ఎంతో నమ్మకంతో తనకు బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షులుకు ధన్యవాదాలు తెలిపారు.

# పెంపుడు కుమార్తె హత్య కేసులో తండ్రి నిందితుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు సస్పెన్షన్

(షణ్ముఖ వెలుగు, అర్ధవీడు, జూన్ 26)
పెంపుడు కుమార్తె అయిన శాన్వితరెడ్డిని అతి దారుణంగా హత్య చేసిన కేసులో నిందితుడైన పెంపుడు తండ్రి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఒకేషనల్ ఉపాధ్యాయుడు పుచ్చకాయల వెంకట రమణారెడ్డిని సస్పెన్షన్ చేసినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ సత్తార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి వారి ఉత్తర్వుల మేరకు జూన్ 6 నుండి సస్పెన్షన్ ఉత్తర్వులు అమలైనట్లు ఆయన తెలిపారు.

# ఉద్యోగులకు అన్ని విధాల అండగా ఉంటాం

రాష్ట్రంలో ఎంప్లాయీస్ ఫ్రెండ్లీ ప్రభుత్వం ఏర్పడింది
ప్రజలు, ఉద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యం
మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 26)
రాష్ట్రంలోని ప్రజలు, ఉద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చడమే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఉదయం నగరంలోని సంతపేటలో గల క్యాంపు కార్యాలయంలో ఏపి జేఏసీ నెల్లూరుజిల్లాశాఖ ఉద్యోగుల సంఘం నేతలు మంత్రిని మార్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంప్లాయిస్ ఫ్రెండ్లీ ప్రభుత్వం ఏర్పడిందని, ప్రభుత్వానికి ఉద్యోగులందరూ పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రజలు, ఉద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చడమే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుకుసాగుతున్నారని చెప్పారు. పదేళ్ల అనంతరం రాష్ట్రమంత్రివర్గంలో మంత్రిగా స్థానం లభించిందన్న మంత్రి ఉద్యోగులకు తన పూర్తి సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ప్రతిఒక్కరి సహకారంతో కూటమి అభ్యర్థులు విజయం సాధించారని, ప్రజలకు ఇచ్చిన హామీలను త్వరగా అమలు చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి జేఏసీ జిల్లాశాఖ నాయకులు అల్లంపాటి పెంచలరెడ్డి, మురళీ, డానియేల్, వై చెంచురామయ్య, శ్రీనివాసులు, మునీంద్రద, శేషయ్య, సతీష్, శివ, కె చిరంజీవీ, శరత్‌బాబు, బాబూరావు పలువురు ఉద్యోగ సంఘ నేతలు ఉన్నారు.

# ఘనంగా తిరుమల స్వామి బ్రహ్మోత్సవాలు

## ప్రత్యేక అలంకారణంలో తిరుమలనాథ స్వామి
## ప్రత్యేక అలంకారంలో తిరుమలనాథ స్వామి రథం
## బండ లాగుతున్న ఎడ్లు
## బ్రహ్మోత్సవాలో భాగంగా సాంస్కృతి కార్యక్రమాలు చేస్తున్న దృశ్యం



**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జూన్ 26)**

మండలంలోని చట్లమిట్ల పంచాయతీలోని రాజంపల్లి గ్రామ సమీపానంలో వెలసిన శ్రీ గొర్రాలికొండ తిరుమలనాథ స్వామి తిరుణాల మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం స్వామివారిని ప్రత్యేక అలంకరణతో పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. గ్రామంలో ప్రజా ప్రతినిధులు పలువురు నాయకులు ప్రత్యేక స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు అర్చకులు భవాని ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి స్వామివారికి కాయ కర్పూరాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు.

అనంతరం బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం చేశారు. దీంతోపాటుగా పలు సాంస్కృతి కార్యక్రమాలు ఆలయ కమిటీ నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**సత్తా చాటిన గుంటూరు జిల్లా పెద్దకాకాని ఎడ్ల**

శ్రీ గొర్రాలి కొండ తిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పోటీలు బుధవారం హెూరాహెూరీగా సాగాయి. గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం కొప్పురావూరు గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు ఎడ్ల జత 2400 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా ఈవేళ మండలం గుంపడమనదీన్నే గ్రామానికి చెందిన పొందూరు రాంభూపాల్ రెడ్డి ఎడ్ల జత 2203.5 అడుగులు లాగే రెండో స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం కోట శ్రీనివాసరావు ఎడ్ల జత 1642 అడుగులాగి మూడో స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం కలనూతల గ్రామానికి చెందిన కటికల జస్వంత్ ఎడ్ల జత 1614 అడుగులు లాగి నాలుగు స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం చెరుస్తా గ్రామం చెందిన చెగ్ర రవితేజ వారి ఎడ్ల జత ఐదు స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతి రూ.70,000 ఏరువా రామాంజనేయరెడ్డి, రెండో బహుమతి టిడిపి నాయకులు మాజీ మండల కన్వీనర్ వెన్న వెంకట్‌రెడ్డి రూ.50,000 వేలు, మూడో బహుమతి రూ.30,000 దుగ్గంపూడి సత్యనారాయణ రెడ్డి బోరెడ్డిపల్లి, నాలుగో బహుమతి మూడమంచు గురునాథం చిన్న యాలమందారెడ్డి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.10,000 కోళ్లగడ్డ సుబ్బారెడ్డి గోవిందమ్మ సిద్దినాయుడుపల్లి వారు గెలుపొందిన యాజమాన్యాలకు బహుమతులు



అందజేశారు. పోటీలో పాల్గొన్న ఎడ్ల యాజమాన్యాలకు దుశ్శాలువాతో పూలమాల వేసి పోరెడ్డి ఆధ్వర్యంలో సన్మానాలు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, అన్నదాన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి, టీడీపీ, బిజెపి నాయకులు, ప్రజలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రమంత్రిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శ్రీ డోల బాల వీరాంజనేయ స్వామికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు

### కొండపి ఏఎంసి మాజీ వైస్ ఛైర్మన్ పులి ప్రసాద్ యాదవ్



**(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, జూన్ 26)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గ్రామ సచివాలయ వాలంటీర్ల శాఖ మంత్రిగా బుధవారం పదవి బాధ్యతలు చేపట్టిన డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయస్వామికి ప్రకాశం జిల్లా కొండపి ఏఎంసి మాజీ వైస్ చైర్మన్, తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకుడు పులి ప్రసాద్ యాదవ్ ప్రత్యేకంగా మంత్రి స్వామికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పులి ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంత్రికి అప్పుజెప్పిన ప్రజా సంక్షేమ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తాడని, అందువల్లనే సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామికి ఈ పదవి బాధ్యతలు అప్పుజెప్పడం ఎంతో శుభసూచకమన్నారు. అంతే కాకుండా కొండపి నియోజకవర్గ పరిధిలో ఉన్న సింగరాయకొండలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడపబడుతున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి హాట్స్ గ్రూప్ సిఇసి 80 సీట్స్ తో పాటు ఎంపీసీ 40 సీడ్స్ బైపీసీ 40 సీడ్స్, ఆధారంగా మంజూరు చేసినందుకు మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామికి పులి ప్రసాద్ యాదవ్ బాల బాలికల తల్లిదండ్రుల పట్ల మంత్రి స్వామికి ప్రత్యేకంగా ఆయన పట్ల హర్షం వ్యక్తం చేశారు. వరుసగా మూడుసార్లు కొండపి నియోజకవర్గం కోటపై తెలుగుదేశంపార్టీ గెలుపు జెండాను ఎగరవేసి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గుండెల్లో మంచి స్థానం సంపాదించుకున్న అన్ని వర్గాల ప్రజలకు సుపరిచితుడు అలాగే మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన శుభ సందర్భంగా ప్రసాద్ యాదవ్ నియోజకర్గ ప్రజల తరఫున ఆయన ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న అన్ని గురుకుల విద్యాలయాల్లో బాలికలకు సంబంధించిన విద్యాబోధన, మెనూ, వసతి గృహాల కల్పన విషయంలో, క్రీడా పోటీల్లో, బాలికలకు సంబంధించిన ఆహారం విషయంలో ఎలాంటి రాజీ పడకుండా వారి అభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నానన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

### మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 26)**

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. బుధవారం కనిగిరి పట్టణం ఏడవ వార్డులోని ప్రభుత్వ పాఠశాలను మున్సిపల్ చైర్మన్ పరిశీలించి పాఠశాలలోని ఉపాధ్యాయులు, ఇతరులతో మాట్లాడి ప్రభుత్వ పథకాల అమలు, వాటి ఉపయోగాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యాభివృద్ధి కొరకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి, కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నాయి. ఉపాధ్యాయులు ఆ పథకాల గురించి విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచే విధంగా ఉపాధ్యాయులు బాధ్యత యుతంగా పనిచేయాలని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాల కంటే వసతుల్లో మరియు విద్యలో ప్రథమంగా ఉండటం మనందరికీ గర్వకారణమన్నారు. విద్యార్థుల కొరకు ప్రభుత్వాలు ప్రవేశపెట్టే ప్రతి పథకం కూడా ప్రతి విద్యార్థికి చేరే విధంగా చూడాలని ఉపాధ్యాయులను కోరారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలు ఇంకా పటిష్టంగా తయారయి పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలు ఒక వరంగా మారతాయని అలాగే చదువుకు పేదరికం అడ్డు రాకుండా ఉండేవిధంగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని అన్నారు. తదుపరి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి భోజనమును విద్యార్థులతో పాటు తిని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, ఆయాలు పాల్గొన్నారు.



# ప్రధానమంత్రి మోడీతో ప్రత్యేకంగా సమావేశమైన టీడీపీ ఎంపిలు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 26)**

ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయంలో బుధవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో తెలుగుదేశంపార్టీ ఎంపిలు ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన నిధులు, ప్రత్యేక హెూదా, పలు అంశాల గురించి చర్చించారు.

# మొక్కులు తీర్చుకున్న నేతలు



**(షణ్ముఖ వెలుగు, చేజర్ల, జూన్ 26)**

టీడీపీ అధికారంలోకి వచ్చినందుకు, మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి గెలుపొంది చేజర్లకు రావడంతో 101 టెంకాయలతో మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు గ్రామ సర్పంచ్ గుమ్మా వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ స్వర్ణ రాంప్రసాద్, పాడేరు పంచాయతిలోని బొగ్గల వారి కండ్రిక గ్రామంలో గంగారపు రమణారెడ్డి, బోయిళ్ళ హాజరత్‌రెడ్డి, వి బుజ్జిరెడ్డి, ఎ పెంచలరెడ్డి పాడేరు బిజెపి నాయకులు లాలి వెంకటయ్య, లాలి శ్రీనివాసులు, మరియు చీర్లవారి కండ్రిక నాయకులు ఉడత రమణయ్య, సానా శ్రీనివాసులు, సిద్దంరెడ్డి పెంచల నరసింహులు, పంచాయతి యువ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బావను హత్య చేసిన బావమరిదికి యావ జీవ జైలు శిక్ష

**(షణ్ముఖ వెలుగు, అర్ధవీడు, జూన్ 26)**

మండలంలోని పాపినేనిపల్లి గ్రామంలో మద్యానికి డబ్బులు ఇవ్వలేదని బావ ఆలమూరి రమణయ్యను బావమరిది పోలేపల్లి శ్రీనివాసులు కత్తితో దాడి చేసి హతమార్చాడు. ఈ ఘటన 27.02.2017వ సంవత్సరంలో జరిగింది. ముద్దాయిని పోలీసులు అదుపులోకి తీసుకొని పూర్తి సాక్షాదారాలను కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ జరిపిన మార్కాపురం కోర్టు ముద్దాయికి పదివేల రూపాయలు జరిమానా తో పాటు యావ జీవ జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పును వెల్లడించింది. సదురు ముద్దాయిని జైలుకు తరలించినట్లుగా పోలీసులు వెల్లడించారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com